ప్రతాపరెడ్డి, సురవరము, 1896-1953

మద్యపానము

అనంతపురము, 1922

Record no. 408

Pratāpareḍḍi, Suravaramu, 1896-1953

Madyapānamu

Anantapuramu, 1922

Record no. 408

Bibliographic Record Target

ప్రతాపరెడ్డి, సురవరము, 1896-1953.
మద్యపానము / గ్రంథకర్త సురవరము ప్రతాపరెడ్డి.- అనంతపురము : కైప. సుబ్రహ్మణ్య శర్మ, 1922.
vi, 79 p. ;18 cm.
Record no. 408

Pratāpareḍḍi, Suravaramu, 1896-1953.
Madyapānamu / granthakarta Suravaramu Pratāpareḍḍi.- Anantapuramu : Kaipa. Subrahmaṇya Śarma, 1922.
vi, 79 p. ;18 cm.
Record no. 408

1764

1764

1764

మద్యపానము

గ్రంథకర్త

సురవరము ప్రతాపరెడ్డి, బి. ఏ.

కె. వి. సుబ్రహ్మణ్యశర్మ,

ఆంధ్రవిద్యార్థి ప్రచురణాలయము,

అనంతపురము.

మద్యపానము

గ్రంథకర్త

సురవరము. ప్రతాపరెడ్డి, బి. ఏ.

(కర్నూలు)

ప్రకాశకులు

వైప. సుబ్రహ్మణ్యశర్మ,

ఆంధ్రవిద్యార్థి ప్రచురణాలయము,

అనంతపురము.

౧౯౨౨.

[వెల ౧౦ అణాలు.

విజ్ఞప్తి.

మహాశయులారా!

ఆంధ్రవిద్యార్థి పత్రికానుబంధముగా భాషానైతిక సాంఘికాది శాస్త్రసంబంధములగు గ్రంథములను బ్రచురింప నుద్దేశించియున్నారము. ఇపుడు ప్రపంచమునంతయు గలవరపెట్టుచున్న మద్యపాన నిషేధక సమస్యనుగుఱించి శ్రీ. సురవరం ప్రతాపరెడ్డిగారిచే రచియింపఁబడిన యీ పొత్తమును బ్రచురించుటకంటె నింక కర్తవ్యమేమని దీనినే ప్రథమకుసుమముగా వెలువరించితిమి. దేశాభిమానులును, పండితులును, విద్యార్థులును, మా యీనూతనోద్యమమున కన్ని విషయములఁ దోడుపడి దీనిని జయప్రదము గావింతురని ప్రార్థించుచున్నారము. మాకీపుస్తకము నత్యంత శీఘ్రకాలములోఁ బ్రయాస యనక వ్రాసియిచ్చి మాకృతజ్ఞతకుఁ బాత్రులైన గ్రంథకర్త గారికి మాయభినందనశతములు.

ప్రకాశకులు.

పీఠిక.

గాంధి మహాత్ముని పవిత్రహృదయము భారతీయుల హృదయములలో పవిత్రభావముల నంకురింపఁ జేయుచున్నది. రాజకీయ, సాంఘికోద్యమముల బలిమికి, ధర్మావలంబనము మూలాధారమనుసంగతి దేశీయులకు హృద్గతమగుచున్నది. ధర్మనిరతుల సంకల్పము అమోఘము. వారు తలపెట్టిన కార్యము నిర్విఘ్నముగ గొనసాగును. ఈసత్యమును భారతవర్షము గుర్తించి, ఆత్మబలమును సేకరించుటకు తనయావచ్ఛక్తిని వినియోగించుచున్నది. ఈప్రయత్నము మూలమున దేశమునందు మార్పులనేకములు జరుగుచున్నవి. కొన్నిదిక్కుల కనివిని ఎరుగని రీతిని సత్వరాభివృద్ధి గలుగుచున్నది. గాఢనిద్రలోనున్న హిందూదేశము ఒక్కమారు మేల్కొని, తన జీవితమునంతను చక్కబెట్టుచున్నటుల, చదువరులకు దోచుచున్నది. వెలుపలినుండి ఎన్ని సంస్కరణములను చొప్పించినను లాభముండదు. అవి సంఘమున జీర్ణముగాక, అతుకులబోలి యుండును. సంఘము బుద్ధిపూర్వకముగ జేసికొనెడి సంస్కరణములే, ఫలప్రదమై, శాశ్వతోపయోగము గలిగించును. సంఘమునకపుడు పునరుజ్జీవము గలుగును. అయ్యది నూతనశోభతో ప్రకాశించును. ఆత్మబలాభివృద్ధికి, హిందూదేశ మవలంబించుచున్న మార్గములలో మద్యపానవిసర్జనము, ప్రాముఖ్యస్థానము బడయుచున్నది.

ధర్మాశక్తి ధర్మాచరణమునకు త్రోవజూపును. ధర్మాచరణము జీవిత శాఖలన్నిటియందును బ్రవేశించును. దేశీయ మహాసభ వారు మద్యపాన విసర్జనమును తమ కార్యక్రమమునందు జేర్చుకొనినను, ప్రజలలో బెరిగిన పవిత్రతలంపులు మద్యపానము పట్లవారికి ఏవగింపు గలిగించెను. సంస్కర్తలిదివరకెన్నడును గలిగింపజాలని విముఖత్వము, ప్రజల హృదయాంతరాళము నుండి బయలుదేరెను. త్రాగుడువలన దేశమునకును, సంఘమునకును ఎట్టినష్టము గలుగుచున్నదో తేటతెల్లమయ్యెను. అవినీతికిని, దారిద్ర్యమునకును, సంఘమెటుల ఆలవాలమయ్యెనో తెలిసివచ్చెను. అమెరికాదేశమునందు మద్యపాన నిషేధశాసన నిర్మాణమునకు ముఖ్యకారకులగు జాన్సను గారీ దేశమునకువచ్చి, హిందూదేశము గాంచుచున్న యభివృద్ధినిగుర్తించిరి. అధికారుల నిరుత్సాహమును లెక్కబెట్టక, ప్రజలీసంస్కరణమును కొనసాగించుచున్న రీతినిగని, యచ్చెరువొందిరి. గాంధిమహాత్ముడు జేయగలిగిన అఖండమగు మార్పునకు వారినభినందించిరి. హిందూదేశము మతబద్ధమయినదని ప్రసిద్ధివడసెను. ప్రధానములగు హిందూమహమ్మదీయ మతములు మద్యపానమును నిషేధించినవి. తగిన ప్రబోధముగలుగుచో, హిందూదేశము మద్యపాన నిషేధవిషయమున, ప్రాచీనకాలమునందువలె నిప్పుడును బ్రపంచమునకెల్ల మార్గదర్శకముగ నుండగలుగును. ఆంధ్రదేశ మీసంస్కరణమును కొన

సాగించుటలో ఇతరప్రాంతములకు తీసిపోవలేదు. మద్యపానపు రాబడియందు ఆంధ్రదేశమునందు గలుగుచున్న తగ్గుదలయే యిందుల కొకనిదర్శనము. ఈ పవిత్రకార్యమును నిర్వహించుటలో, అధికారులు గలిగించుచున్న ఆటంకములచేగాని, వారు విధించుచున్న దండనలచేగాని ఆంధ్రులు నిరుత్సాహము జెందుట లేదు. ఆంధ్రదేశ మింతవరకు సలిపిన కృషి ప్రశంసార్హమయినను, మద్యపాన దురభ్యాసమును పూర్తిగ పారద్రోలుటకు, ఇంకను నెక్కుడు పట్టుదలతో పాటుబడుట యవసరము. ఇందులకుతగిన ప్రబోధము కలుగవలసిన యావశ్యకతగలదు.

శ్రీయుత. సురవరము ప్రతాపరెడ్డిగారు వ్రాసిన యీ గ్రంథము, తరుణసమయమున వెలువడినదనుటకు సందియము లేదు. ఈగ్రంథమునందు, మద్యపాన విసర్జనావశ్యకత చక్కగ తేటపరుపబడెను. శైలిసరళము. భాషసులభము. విషయములు సులభగ్రాహ్యములు. మద్యపాన నిషేధోద్యమమును గూర్చి తెలిసికొనదగిన సంగతులన్నియు చక్కగ కూర్పబడుటచే, ఈగ్రంథమెంతయు పఠనయోగ్యముగ నుండగలదు. హిందూదేశమతములు మద్యపానము నెటుల నిషేధించెనో దృష్టాంతరపూర్వకముగ గ్రంథకర్త సూచించెను. మద్యపానము ఆరోగ్యము నెటుల క్షీణింపజేయునో కనుబఱచి, ప్రతిపక్షులు దెలిపెడి కువాదములను గ్రంథకర్త సహేతుకముగ ఖండించెను. మద్యపానమువలన మనదేశమున కలుగుచున్న చెడుగు

లను వివరముగ దెలిపెను. అమెరికాదేశమునందు, మద్యపాన నిషేధోద్యమము ప్రజల పునరుద్ధారణమున కెటుల తోడ్పడెనో గ్రంథకర్త వివరించుటయగాక, ఇంగ్లండు మొదలగు నితరదేశములందు ఈ యుద్యమమెటుల వ్యాపించుచున్నదో తేటపరిచెను. మనదేశమునందు మద్యపాన నిర్మూలనముపట్ల సామాన్యముగ దెలుపుచున్న ఆక్షేపణలను గ్రంథకర్త పుస్తకాంతమున చక్కగ విమర్శించి, అసహాయోద్యమము ఆంధ్రదేశమున మద్యపాన నిషేధమున కెటుల తోడ్పడినదియు కరతలామలకము గావించెను. ఆంధ్రదేశమున బ్రజలలో ప్రబోధము గలిగించి, మద్యపాన నిషేధోద్యమమును త్వరితముగ వ్యాపింపజేయుట కీగ్రంథమెంతయు నుపయోగపడునని నేతలంచెదను. ఇట్టి గ్రంథముల నింకను రచించుటకు, ఆంధ్రులీగ్రంథకర్త కధిక ప్రోత్సాహమొసఁగుట ధర్మము. ఆంధ్రభాషలో ప్రస్తుతోద్యమ ప్రచారమునకు, సులభశైలిని వ్రాసిన గ్రంథములను విరివిగ ప్రచురించుట కావశ్యకత ఎంతయేని గలదు. ప్రతాపరెడ్డిగారిని బోలు సంస్కరణాభిమానుల యుత్సాహము వలన, ఇట్టి సద్గ్రంథములు త్వరలో వెలువడి, ఆంధ్రదేశపు కొరంతను తీర్చుగాక !

మదరాసు
౩౦-౧-౨౨.

చల్లా. శేషగిరిరావు.
ఆంధ్రపత్రికా సంపాదకులు.

తొలిపలుకు

భారతీయులార ! మద్యపానాభ్యాసము దేశమునకు హానికరమని యందఱకు విదితము. ఈసంస్కారమొక మతమునకు చేరినదికాదు; ఒకదేశమందే సలుపవలయునని యేర్పాటు లేదు; దేశసేవఁజేయఁదలఁచు ప్రతి భక్తుఁడును, మత, కులభేదములఁ బాటింపక యీకీడును మాన్పఁగడంగవలయును. ఇందు, మితవాదులేమి, క్రైస్తవ పారసీకులొండె, ముసల్మానులొండె, యందఱును నైకమత్యభావమును జూపుచు లోకోపకారమును జేయవచ్చును,—చేయవలసినవిధియు. ఈచిన్నిపొత్తము వ్రాయుటయందు నాకీగ్రంథములు తోడ్పడినవి.

౧. Dry America. Nihal Singh.
౨. Drink and opium evil. C. F. Andrews.
౩. Control of the drink trade. H. Carter.
౪. Alcohal a menace to India. London.
౫. Sturge-Alcohal and the humun Body.
౬. Johnson's (Pussyfoots) life.

ఇంకను గొన్ని పత్రికలలో ప్రచురింపఁబడిన వ్యాసములును, యంగుఇండియాలోని వ్యాసములు మున్నగునవి. గ్రంథకర్తలకు, నా కృతజ్ఞతాపూర్వక వందనములు.

గ్రంథకర్త.

మద్యపానము

క. అవమానంబును జెందును
వివిధాయాసంబులఁబడి వేదననొందున్
భువినిర్ధనుఁడౌ, నీచా
సవమును గ్రోలుమనుజుండు సంతతమరయన్.

గీ. ప్రకృతి ననుసరించి బ్రదుకు పశువులెల్ల
మత్తుగలిగించు వస్తువుల్ మానియుండ
జ్ఞాన మభివృద్ధి సెంద నంగారణమున
సురను గ్రోలఁగడంగిరి నరులు భువిని.

క. ధనమా వ్రయమైపోవును
మనమా చులుకుందనమును మానును, యశమా
దినదినమును క్షీణించును
దనువా చెడిపోవుఁగల్లు ద్రావుటచేతన్.

గీ. మును మతాచార్యులు, గురులు, మొదలుగాఁగ
నేటివఱకును దెలిసిన మేటివారు
గల్లు, సారాయి, గంజాయి, నల్లమందు
వాడకూడదు సుమ్మని పలుకలేదె ?

క. ఈదుష్టాభ్యాసంబునఁ
బ్రాదుర్భవ మొందుఁ గ్రౌర్య పద్ధతులెల్లన్
మోదము సెందు కుటుంబము
వాదులతో నిండియుండి వర్థిలదెపుడున్.

మతములలో మద్యపానచర్చ:

“పురాతనకాలమునుండియు మితజీవనము (Temperance) ననుసరించిన హిందూస్థానము మద్యపాననిషేధమునందుఁ బ్రపంచమునకు మార్గదర్శిగానుండి యుండవలసినది. కాని యీకార్యమమెరికాచేఁ జేయఁబడెను. అయినను ప్రాక్ప్రపంచమున నీభూమియే మొదటి దగునటులచేయుటకు మనలో సామర్థ్యము గలదు.” [“సెయింటునిహాలుసింగ్.”]

సురాపాన ప్రారంభము.

ఆర్యులు సింధూప్రదేశమును దమస్థానముగఁ జేసికొనిననాఁడనేక దేవతలఁ బూజించుచుండెడివారు. వారికి గోవులే సంపద. కృషిచేయుచుఁ బంటలపండించి సమృద్ధియం దోలలాడుచు సదా సంతోషమున కాలము గడుపుచుండిరి. వారు హోమములుసేయుచు సోమమును సిద్ధముచేసి దేవతల నారగింపఁ బిలుచుచుండెడివారు. ఇంద్రుఁడు దన పచ్చనిగుఱ్ఱములతో సిద్ధ్వఁబడిన రథమునెక్కి వచ్చి వీరిచ్చు నాతిథ్యమునందుచుండెను. అగ్నిదేవుఁడు గడ్డమునుదువ్వుకొనుచు జ్వాలాజిహ్వాల చప్పరించుచు సోమపాత్రముల నోటికెత్తి తెగపీల్చెడివాఁడు. అంత కొంతకాలమునకు సోమపానము పోయెను. మాంస

భక్షణము భోజనానర్హ మయ్యెను. ఆర్యులు పరబ్రహ్మతత్వా న్వేషులై పూర్వోత్సాహమును వేరుత్రోవలం ద్రిప్పిరి. సూత్ర కారుల నాటికి సర్వము నిషిద్ధమయ్యెను. కాని అచ్చటచ్చట త్రాఁగువారు తమ యాచారముల మానలేదు. మదిరాపాన మును జేయక, పలలమును మెసవక సన్మార్గమవలంబించి వేద ములు సదువుచు బ్రహ్మజిజ్ఞాసులైన విప్రులు నాటికిని నేటికిని గౌరవస్థానమం దున్నవారు. ఇక్కాలమున మనలో కలహ ములు పెరిగి యొకరినొకరు దూషించుకొనినను, బ్రాహ్మణులలో నితరగుణము లెన్నియో మాసిపోయినను, మొత్తమునకు త్రాఁగ కుండుట, మాంసమును మెసవకుండుట, శుభ్రత — యీ మూఁడుగుణము లింకను వారిలో సదాచారమైయుండుట కడుం గడుఁ బ్రశంసనీయము.

సూత్రకాలానంతరము బౌద్ధమతము మన హిందూమత మునుక్రమింగి దేశమంతటను వ్యాపించి సురాపానాదులు సన్మార్గ విరోధములనియు, పరిశుద్ధాత్మను బొందనీయవనియుఁ జాటెను. ఇటులే ప్రతిమహనీయుఁడును బోధసేయుచు వచ్చెను. కావు ననే మనదేశములో మద్యపానము విశేషముగా లేకుండెను. ఎచ్చోనైననుండిన నా యాచారములుగలవారు రహస్యముగాఁ ద్రావుదురు. పాశ్చాత్యజాతులలోఁ జేయురీతి మనదేశమం దెవ్వఁ డును బహిరంగముగా సిగ్గులేక మద్యపానము చేయఁడు. పంచమ జాతివారును గ్రామమందలి పెద్దలెదురైన ముంతల దాఁచు కొనిపోవుదురు. కాని పాశ్చాత్యమర్యాదలు దినదినము మన

యనుజులలోఁ బ్రబలుటచే మద్యపానముకూడ వృద్ధినొందు చున్నది. పూర్వము మనవారేరీతి నీ పానమును ఖండించిరో కొన్ని నిదర్శనములఁ జూపించెద :—

శ్లో॥ బ్రహ్మహత్యా సురాపానం స్తేయంగుర్వం గనాగమః।
మహాంతి పాతకాన్యాహు స్సంసర్గశ్చాపి తైస్సహ॥
[మనుస్మృతి. ౧౧ అ. ౫౪ శ్లో.]

బ్రహ్మహత్య, సురాపానము, దొంగతనము, గురుభా ర్యాసంగమము, వీని నొనరించువారితోఁ జేరియుండుట, యీ యైదును మహాపాతకములు ; అని మనువు శాసించుటయేకాక పూర్వకాలమందేమి, ఆధునికుల కాలమందేమి, కల్లు, సారాయి, భంగి, నల్లమందు ఇత్యాది ద్రవ్యముల వాడుట సర్వానర్థ దాయకమని నొక్కివక్కాణింపని మానవుండెందైన గలఁడా ? మత్తుగలిగించు వస్తువుల స్వీకరించువారు మాత్రము ‘ నిషా ’ లేని సమయమున తాము సేయునది చెడ్డదని యొప్పుకొనరా ? పోనీ, మన దేశమందేకాదు, ప్రపంచమం దే చోటుననైన త్రాఁగుట, పీల్చుట, కైపెక్కుట, క్రిందఁబడి పొర్లాడుట మొదలగు హేయమగు కార్యములు మంచివని తీర్మానించిన మహానుభావులు కూడ కలరా ? మద్యపాన మదోన్మత్తులలో వ్యాపారములు సేయనగునా ?

మనువు,

శ్లో॥ మత్తోన్మత్తాద్యధీనై ర్బాలేనస్థవిరేణవా।
అసంబంధ కృతశ్చైవ వ్యవహారో నసిద్ధ్యతి॥

“పానము, వెఱ్ఱి, వ్యాధి, స్వాధీనము లేమి, బాల్యము, వృద్ధత్వము, ఇట్టి గుణములుగల వారియొక్క పితభ్రాంతలయను మతి లేక యిచ్చినయప్పు మొదలగువానిని గుఱించి, వ్యాజ్యము వచ్చినట్టయిన నది త్రోలగింపఁబడతగినది.”

[౧౬౩-వ శ్లోకము.]

శ్లో॥ సురా వై మలమన్నానాం పాప్మా చ మలముచ్యతే ।
తస్మాద్బ్రాహ్మణరాజన్యౌ వైశ్యశ్చనసురాం పిబేత్ ॥

యాజ్ఞవల్క్యుఁడు :—

సురాపోఽన్యతమంపీత్వా మరణాత్ శుద్ధి మృచ్ఛతి॥

సూరాపానముచేసినవాఁడు మరణముచేతనే శుద్ధినొందునఁట—

విశిష్ఠుఁడు :—

పతత్యర్థం శరీరస్య భార్యాయస్య సురాంపిబేత్ ।
పతితార్థం శరీరస్య నిష్కృతి ర్నవిధీయతే ॥

ఇచ్చట స్త్రీలకుఁగూడ కల్లు ప్రతిసిద్ధమైనది. కలియుగమందు పరాశరస్మృతిననుసరింపవలయునని పెద్దలు చెప్పుదురు కదా; అందు సురాపానవిషయమై యిట్లు వ్రాయఁబడినది :-

“చ॥ అనిశము మద్యమాంసరతుఁడై రథచోదక వర్తనాది జీ
వనుఁడగు నీచశూద్రుని శ్వపాకుని యట్లుఁ ద్యజించు టొప్పునా
మ్మనమునఁ బాఱులంగొలిచి మాంసము కల్లునుమాని స్వీయ క
ర్మ నిరతుఁడైన శూద్రుని ధరంద్యజియించుట యొప్పదెప్పుడుఁ॥”

[మూలమునకు ప్రభాకరకవుల భాషాంతరీకరణము.]

పంచమవేదమనియు, పండిత పామరజనులకందఱకును ప్రమాణమైనట్టి భారతమందేమి యున్నదో కనుఁడు :—

సీ. కల్లుద్రావిన పాతకంబు బదియగ్నివర్ణముగాఁగఁ గాచిపానంబు సేయఁ
గనుమూసియుఱుకంగననలంబుఁజొరమహాప్రస్థానమాచరింపంగఁబోయు

[శాంతి. ౧ అ. ౩౦౭. ప.]

క. వినుసురతోఁ గూడగ దె
చ్చిన యెట్టిది యెద్దియును భుజింపరభోజ్య
త్వనిరూపణ నిపుణతగల
మనుజోత్తము లఖిలలోక మాన్యచరిత్రా.

[శాంతి. ౧ అ. ౩౨౩ ప.]

సురతోఁ గూడిన వస్తువు లంటఁగూడదఁట. సురను గడుపులలో నించినవారి విషయమింక చెప్ప నవసరము లేదు.

ఇటులే తక్కినమతములందును, ముఖ్యముగా హీబ్రూ, ఇస్లాము, బౌద్ధమతములలో మద్యపానము హేయమగు కార్యమనియుఁ, బాతకమనియు, శాసింపఁబడినది. ప్రకృతకాలమందు మద్యపాన సర్పముఖమునఁ బడినట్టులు మహమ్మదీయ పరిపాలనమందు లోకులు దానియందుఁ దగుల్కొనినట్లు కానఁబడదు. ప్రతిసంవత్సరమును గల్లుత్రాఁగువారి సంఖ్య మితిమీఱి పోవుటయే ముఖ్య నిదర్శనము. ఇంతియకాక మొగలాయి పాదుషాలు మతాభిమానులు. ఇస్లాము చట్టములకు వ్యతిరేకముగా నాచరించిన వారుకారు. ఔరంగజేబు చక్రవర్తి యెంత దుర్మార్గుఁడైనను మదిరాదుల నంటినవాఁడుకాడు. ఇతరులంట సహించువాఁడుకాఁడు. అన్ని మతముల సంగతి యట్లుండనేలనో క్రైస్తవులు సారాయి మొదలగువాని విషయమై విశేషముగాఁ

చర్చించిన వారుకారు. రొట్టియు, సారాయి, యేసుక్రీస్తువు మాంసరక్తములతో సాటియనియు, వాని నారగించుటకర్తవ్య మనియు, వారి యభిప్రాయ ముండినటులున్నది. కొలఁది కాలమునకుమున్ను అమెరికాలోని జనులందఱు మద్యముల మాన్పఁడని మొరలిడ క్రైస్తవ బిషప్పులు కొందఱు మతముపేరిట యాక్షేపించి సారాయిని ద్రాఁగవలయుననియే పట్టువట్టిరఁట.

ఆవిషయ మటుండనిండు. మన మతవిషయమై మనము విశేషముగాఁ జర్చించెదము. ఇట్లు శాస్త్రకారులు, స్వాములు, ఆచార్యులు మున్నగు మహాపురుషులందఱు మద్యమును ఖండించియుండ సంఘమం దింకను ద్రాఁగుట తక్కువకాకపోవుటకు గారణ మేమియుండవచ్చును? దీని కనేక కారణములు గలవు.

(౧) మనలో నుత్కృష్టజాతియం దుద్భవించినవారు విశేషముగాఁ ద్రాఁగునట్టి తమ శూద్రసోదరులకుఁ బట్టుదలతో బోధింపకపోవుట కొంతలోటు.

"తస్మాద్బ్రాహ్మణ రాజన్యై వైశ్యశ్చ న సురాంపిబేత్."
అను శాస్త్రశ్లోకమందుఁ బై మూఁడువర్ణములవారికే బుద్ధి సెప్పఁబడినది. నాల్గవవర్ణము, ఈనాటి యైదవవర్ణ మీశ్లోకములోఁ జేరఁగూడదా? పశుపాల మాకాలమునుండియే వృద్ధి యాచుండవలయునా? శ్రీరామానుజాచార్యులు, శ్రీరామానందులు మొదలగు సంఘసంస్కారకర్తలప్పుడప్పుడు సామాన్యజనులను తమ నిద్రావస్థనుండి జాగరూకులౌన ట్లొనర్చిరి.

కాని శాశ్వతముగా శూద్రాదులకు శాస్త్రరహస్యములఁ దెల్పుచుఁ జదివించుచు వారిజ్ఞానమును బెంచిన మహనీయులరుదు.

(౨) విగ్రహారాధనము గొన్నితావుల నీ దుష్టాచారమునకు సహాయ మొనర్చినది. (ఇందుచేత విగ్రహారాధనము చెడ్డదని నా మతముకాదు.) అనేకజాతులవారు చెట్లనుబూజించుచు శిలల కిష్టమువచ్చినపేరు పెట్టి, యాస్వామియో, లేక దేవియో, బలికోరెననిమిష పెట్టి గొఱియలనఱకుచుఁ గడవలకొలఁది కల్లును, సారాయినిదెచ్చి, స్వామికి నైవేద్యమిచ్చి తామును ద్రావుచుందురు. పండుగలు, తిరునాళ్లు, ఉత్సవములు, వివాహములు, తద్దినములు ఇవన్నియు నీకార్యములకుఁ గొన్నిచోట్ల మంచిసమయములు. కొందఱకు పీర్లపండుగ నవరాత్రులకన్న ముఖ్యము. ఏలనన, నాపండుగయం దిష్టమువచ్చినట్లు గంతులువేయుట, పొట్టలు పగుల త్రాఁవుట యాచారము.

(3) మతముపేరిట కొందఱాసవపానోత్సుకులై యజ్ఞానులకుబోధించి వారి సహాయమునఁ ద్రాఁగఁగలరు. వైష్ణవులలో శాక్తేయులలో, కాపాలికులలో గొందఱు నేటికి నీకార్యమునకై లోకులఁ బ్రోత్సాహపెట్టుచుందురు. 'అయ్యవారిని జేయ కోఁతి పిల్లయయ్యె' నన్నట్లు శ్రీరామానుజాచార్యులు సంఘలోపములను సంస్కరించిపోఁగా నామతమందలివారు కొందఱు తెఱచాటనియు, గోష్టియనియు నేమేమొ చిత్రచిత్రాకారముల నెలకొల్పినారలు. శక్తిని బూజించువారు నైతము సురాపానమును జేయుచుండుట శోచనీయమై యున్నది. ఇట్టి పండితమ్మ

న్యులే కొందఱుపూర్వకాలమున తమ దుర్మార్గములకు శాస్త్రాధారములుకలవని "కాళిందీ గ్రంథతంత్రము" వంటి కుతంత్రములు కొన్ని వన్ని యిట్లు వ్రాసిరి.

"పీత్వాపీత్వా పునఃపీత్వా యావత్పతతి భూతలే
పునరుత్థాయ వైపీత్వా పునర్జన్మ నవిద్యతే ॥"

త్రాఁగిత్రాఁగి, తప్పఁద్రావి, మత్తిల్లి, నేలఁగఱచి, మరలలేచి, తిరిగి త్రాఁగినట్టయిన వానికింక జన్మమే లేఁదట. చదువరులార! యీశాస్త్రవాదమే నిక్కమైన మనిమింక పునర్జన్మ రాహిత్యమునకై వేదములు మొదలుగ శ్రీశంకరులవంటి యాచార్యుల వాదములవఱకు చదివి చదివి వారునేర్పిన ప్రకారము సంసార సాగరోత్తీర్ణ ప్రయత్నములు వేరే యేల చేయవలయును? మద్యమాంసములే "మోక్షదాహి యుగేయుగే" యన్నట్లు త్రాఁగి చెడిపోవచ్చును గదా! ఇ దుష్టవాక్యములు ఋషులు వ్రాసియుందురా? ఎవరో దుష్టులు కొందఱు శాస్త్రములలోదూర్చి మూర్ఖుల నమ్మించుటకై చేసి యుందురు. ఇట్టి శ్లోకముల వ్రాసిన త్రాఁగుఁబోతుల విషయ మటుండనిమ్ము. హిందూబౌద్ధజైనమతములలో ప్రామాణికమైన శాస్త్రముల నెచ్చటను కల్లుగాని, సారాయిగాని మఱియే మత్తు వస్తువుగాని మంచిదని వ్రాయలేదని యెల్లరకుఁ దెల్లము. మన మతమందే కాదు. ఇస్లాములోఁగూడ మనవారు వ్రాసిన దానికన్న కఠోరముగా వ్రాసినారలు. కల్లు సారాయి మన శత్రువులనియు, చెడ్డవనియు (హరామ్) తీర్మానించినారలు.

సురాపానమును రెండువిధములుగా విభజింప వచ్చును. పరిశ్రమాంతమున సేద దీర్చుకొనుటకై లేక మరల పనికి నూలు కొల్పుటకై త్రాఁగుట యొకవిధము. ఉత్సాహమునకై స్నేహితులతోఁ గలసి త్రావుట రెండవ విధము. ప్రథమ విధమును గుఱించి వేరుచోఁ జర్చింపనగు. ఉత్సాహమునకై త్రాఁగువారు విశేషముగా ధనికులలోఁ గాన్పించెదరు. శూద్ర గృహములలోఁ గొన్నిట వివాహకాలములందు బంధుమిత్రులందఱును గలిసి వినోదము సేయుచుఁ, ద్రావుచు, మెసవుచు, గంతులు వేయుచు, రంతులు వెట్టుచు, కాలము పుచ్చుదురు. సురాపానమా! నీమాహాత్మ్యమెంతని సంస్తుతింతు! ఈసురను లోపలికేగి నంతనే సరసము బయటకుఁ బొంగివచ్చును గదా! ఇంతియకాక యీజాతులలోఁ బితృదేవతలకు శ్రాద్ధము వెట్టునపుడు పొట్టేలును గోసి కడవలకొలఁది కల్లును దెచ్చి చచ్చినపెద్దలఁ దృప్తిపఱచుటయే కాక నచ్చిన పెద్దలనుగూడ వానితోఁ దనివితీర్చి తామును మెక్కుచు, మెసవుచు, బీల్చుచుందురు. గురువులవారు వచ్చినవెంటనే వారి యెదుట కొంత పలలమును గొంత సురను నుంచుదురు. వారి భుక్తశేషమును నందఱు శ్రద్ధాళులై క్రోలి చిన్నపిల్లలకు సహితము గురుప్రసాదమని యిచ్చుచుందురు. ఇట్టి దురాచారములింకను ప్రబలియుంట సంఘమునకంతయుఁ దలవంపు లగుచున్నవి. ఈసందర్భమున మతాచార్యులకును పీఠాధికారులకును భక్తి వినయపూర్వకముగా నొక విషయము నివేదించెద.

"శ్లో॥ అగ్రేవహ్నిః పృష్ఠేభానుః
రాత్రౌచుబుక సమర్పితజానుః
కరతలభిక్ష స్తరుతలవాసః
తదపినముంచ త్యాశాపాశః॥"

ఇట్టి ఘోరతపములు సేయుచు నాడంబరములేక సదా కర్మయోగాభ్యాసనారూఢులుగా నుండవలసిన యతీశ్వరులు మఠాధికారులై యనేకులవలన ధనముల గ్రహించుచు, ఏనుఁగులు, గుఱ్ఱములు, భటులు, తప్పెటలు, బంగారుపల్లకీలు, ఢక్కలు మొదలగు దడబిడలతో నూహారఁదిరుగుచు లోకులను వృథా కష్టపెట్టుటకన్న వారికి సద్బోధలఁజేసి శాస్త్రస్మృతమును గ్రోలనిచ్చి, సన్మార్గమున నడిపి, దేశక్షేమమును సమకూర్చువారై యుండుటెంత శ్లాఘ్యాపాత్రమో యూహింపుఁడు. నేఁడాచార్యులందఱలో శ్రీ శారదాపీఠపు శంకరాచార్యులు (భారత కృష్ణతీర్థులవారు) దేశహితమునకై శ్రమించుటచే నా స్థానమునకు వన్నెదెచ్చినవారై గురుస్థానమందుండుటకుఁ దగినవారు. ఏమిచిత్రమో! ఆదిగురువులచే స్థాపింపఁబడిన పీఠములనధిష్ఠించినవారికన్నా కాలమున శ్రీవివేకానంద, శ్రీదయానంద, శ్రీ రాజరామమోహనరాయలు మొదలగు వారు మతమునకు మేలుచేసినరీతి శ్రమించినవారరుదు. ఆచార్యులందఱికనైన విశేష శ్రద్ధవహింతురని ప్రార్థించుచున్నాను.

మద్యపానము—ఆరోగ్యము.

శ్లో॥ నయనాని ఘూర్ణయన్ వచనాని స్ఖలయన్ పదే పదే।
అసతిత్వయివారుణీ మదఃప్రమదా నామధునావిడంబనా॥
[కాళిదాస.]

తా॥ "ఇపుడు ప్రియసంగమకారరివి నీవు లేనందున యువతులకు కన్నులను సుడియం జేయునదియు, మాట మాటలోను తడఁబడఁ జేయునదియు నగు సురాపానము, ఉత్తవేసమువంటిది. నిష్ప్రయోజనము"—

"శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి"

మాటలలోఁ దడఁబాటును గలుగఁజేసి, కన్నుల సుడియం జేసియు, మనుష్యుని తనప్రభుత్వమున కొలువుబంటుగాఁ జేసికొనిన కాదంబరీదేవి సామర్థ్య మెంతటిదో కనుఁడు. ఈ పానముచేయువారి శరీరములలోని సర్వాంగములు, మెదడు, శిరస్సు, కార్జము, రక్తనాళములు మొదలగు నవయవములన్నియు శీఘ్రముగా క్షీణించునను విషయమిందు విశదముగా వెల్లడింతును.

సారాయి, బ్రాందీ, విస్కీ మొదలగు మద్యములం దన్నిఁటను ఆల్కహాలను విషద్రవముకలసి యుండును. పరీక్షించి

చూడగా ౧౦౦ భాగములలో నీక్రింది విధమున ఆల్కహాలా యావస్తువులందు మిశ్రమైనట్లు కనఁబడినది.

బియరు	౫	వంతులు.
పోర్టువైన్	౧౮	,,
షాంపేన్	౧౧	,,
జిన్	౩౧	,,
విస్కీ	౪౦	,,
బ్రాందీ	౪౬	,,

అనేక వైద్యశిఖామణులు మద్యపానము విషతుల్యమనియు, తన్వంగముల నన్నింటిని శీఘ్రకాలమున నశింపఁజేయునదనియు నుద్ఘోషించి యభిప్రాయ మిచ్చినారు. హార్లీస్సయు, స్టర్జియును వ్రాసిన గ్రంథమందు వైద్యుల యభిప్రాయముల ననేకముల విశదీకరించినారలు. సారాయి మొదలగునవి యౌషధములుగా వాడుట లేదాయని యాక్షేపణ కలుగవచ్చును. శాస్త్ర మభివృద్ధి నొందినకొలఁది నూత్న విషయములు మనకు స్ఫురించుచుండును గదా! ప్రకృతపు వైద్యులు వీని నౌషధములలో వాడుట మానినారలు. వైద్యశాలలలో (ఆసుపత్రులు) సహితము వీని నుపయోగము త్యజింపఁబడినది.

మద్యపానము సేయువారు స్మృతి తప్పుదురు. వారి రక్తనాళములన్నియుఁ జెడిపోవును. ఈమద్యమున్మాదమును గూడ కలిగించుచుండును. అనేకులు తమ కజీర్ణము కలిగినపుడు

త్రాఁగిన జీర్ణశక్తి కలుగునని త్రాఁగనేర్చెదరు. కాని వారు గొప్ప పొఱపాటు పడినవారు. "గోరుచుట్టుపై రోకటిపోటు" విధముగా వారి జీర్ణశక్తి యింకను తగ్గి దీర్ఘజాడ్యము సంభవించును.

కార్జము—త్రాఁగుడు ముఖ్యముగా కార్జమును పాడుచేయును. అందుండు రంధ్రములన్నియు మూతఁబడి రంగుమారి తాము చేయవలసినపనిని జేయఁజాలక మనుజుని త్వరగాఁ దుదముట్టించునని లేండను తన పుస్తకమందు వ్రాసియున్నవాఁడు.

త్రాఁగువారి రక్తనాళములు పటుత్వమునుమాని ముదుసళ్ల నాళములరీతి మారియుండును.

హృదయము—స్టర్జి యిట్లు వ్రాయుచున్నాడు. ఇంతవఱకును ఆల్కహాలు గుండెకాయను బలపఱచునని తలంచుచుండిరి. కాని శాస్త్రప్రకారముగా పరీక్షించి విమర్శించిచూడ ఆల్కహాలులో ౧/౧౦౦ వంతు రక్తముతోఁ గలసినట్లైన రక్తమును యథాప్రకారము ప్రవహింప శక్యముకాదనియు దానిచే హృదయము దుర్బలస్థితిలో నుండుననియు తెలియుచున్నది."

త్రాఁగువారిలో కొందఱు స్థూలశరీరులగుటచేఁ ద్రాఁగుట వలన మాంసరక్తములు వృద్ధియైనవని కొందఱభిప్రాయపడుట తప్పని లేండను తెలుపుచున్నాడు. త్రాఁగువారు లావగుట క్రొవ్వు శరీరమందు చేరుటయే ముఖ్యకారణము. శరీరమందు పనిచేయు గొట్టములు (Cells) బలహీనమయినపుడు మాంస

మునకు మారుగా క్రొవ్వుచేరును. కావున నొకఁడు స్థూలుఁడుగాఁ గనఁబడినవానికి 'ఆకారపుష్టియే కాని లోపల యింకే సత్తయునుండదు. శరీరనాడుల పాడుచేసి మెదుడును, బలహీనమగునట్లొనరించి త్రాఁగువాఁని నున్మాదులనుగాఁ జేయుననుటకు "క్లౌస్టను" అను నున్మాద వైద్యశాలాధికారి ౧౯౧౩ సం॥న యిట్లు వ్రాయుచున్నాడు.

" ఆల్కహాలువలన దినదినమున్మాదులు విశేషమగుచున్నారు. ఈసంవత్సరము ఉన్మత్తులలో పురుషులందు ౧౦౦ గురకు ౪౩ గురు వంతునను స్త్రీలయందు ౧౦౦ గురకు ౧౭ వంతునగు సంఖ్య కనఁబడినది. వీరతిశయముగా త్రాఁగినందుననే యిట్టిది సంభవించినది. "

త్రాఁగుటవలన శరీరమందు వ్యాధులు సంభవించుటయే కాక ఆకస్మికముగ గలిగిన గాయములు, పుండ్లు మొదలగునవి సామాన్యముగా మానవు. ఈయపాయములు తీక్ష్ణములైనచో బాగుపడుట దుర్ఘటము—అలసట సెందినవారికి, మూర్ఛిల్లినవారికి, చలిచే బాధపడువారికి, అస్వస్థత గల్గినవారికిని బ్రాందీ మొదలగు వానినిచ్చు వాడుకకలదు. ఇది దోషమనియు, వానికి మారుగా టీ, కాఫీ, లేక వేడిపాలు, ఇచ్చుట శ్రేయస్కరమని లేండనుగారి యభిప్రాయము.

శీతల ప్రదేశములలో ప్రయాణము సేయువారికి నుష్ణమొసంగుటకై బ్రాందీయవసరమను సంగతి మిథ్యయని ఆర్కి-

టికు ప్రదేశములు కనిపెట్టఁ బోయిన డాక్టరు నాన్సెన్ గారిట్లు వ్రాసియున్నారు.

" శీతలదేశ ప్రయాణమందు త్రాఁగుట యవసరమని లోకుల యభిప్రాయము. ఎవ్వరైన కాని యిట్లొనరించి లాభ మొందినటుల నాకు తెలియఁబఱచినఁ జాలు. అంతవఱకు— ఆర్కిటిక్కులో ఆల్కహా లవసరము లేదని నాదృఢాభిప్రాయము."

ఆల్కహాలు-ఆహారమా—ఇంగ్లండులో నొక సారాయి వర్తకుఁడు " బియరు పాలకన్న మిన్న " యని ప్రచురించెనఁట. శాస్త్రజ్ఞులు (Scientists) సారాయిని, పాలను, పరీక్షించి వానిలోని తారతమ్యముల నిట్లు సిద్ధాంతీకరించిరి.

౧. పాలలో నొకవిధమైన క్రొవ్వుగలదు. దానిమీఁగడ నుండి వెన్న, నెయ్యి సిద్ధము చేయఁబడును. కల్లుయందుగాని, సారాయిలోగాని యిట్టి గుణములు గనుపింపవు.

౨. పాలలో నొకవిధమైన తియ్యందనము గలదు. దీని వలన బలము హెచ్చును. సారాయిలో నీగుణము లేదు.

౩. పాలనుండి వచ్చు పెరుగు మాంసపుష్టి నిచ్చును. సారాయిలో నుండు బలపదార్థము పాలయందుండు దానిలో ౧/౧౪ వ వంతుకలదు.

౪. పాలలో విషము వాసనయే లేదు. సారాయిలో ఆల్కహాలను విషము కలదు.

ఈవిషయము లన్నింటిని గమనించిన సారాయి మొదలగు వానియందు, బలము నిచ్చు గుణములైనను, ఆరోగ్య సూచకములైనను, శ్రమాపనోదక్రియలును, నేవియును గానరావు, కాని మేలుకు మారుగా కీడుకలుగుట తథ్యము. అనేక రోగములు ముఖ్యముగా లోహములందు పనిచేయువారికిఁ గలుగు రోగములు త్రాఁగువారిలోనే కనఁబడును. 'స్కాటు' అను వైద్యుఁడు ౧౯౦౪ సం॥న యిట్లు వ్రాసెను. "సీసపు గనులలో పనిచేయు త్రాఁగుఁబోతులకుఁ దప్పక జాడ్యములు సంభవించుచుండెను. త్రాఁగని వారిలో సీవిషసంబంధ రోగము లొక్కరికైనను రాలేదు."

ఒక వైద్యుఁడు ఆల్కహాలు - 'నిమోనియా' అను రోగము గలుగ జేయునని తెలిపి యున్నవాఁడు. ౧౯౦౫ సం॥న క్షయరోగమును గుఱించి సమావేశమైన సంఘమువారిట్లు తీర్మానించిరి. "ఆల్కహాలునకు క్షయరోగమునకు చాలసంబంధముండుటచే నీ సంఘము క్షయరోగ నివారణకై ఆల్కహాలు నివారణను గూడ చేయ ప్రయత్నించవలయును." రాచపుండను వ్రణము విశేషముగా మద్యపానులలో సంభవించునటుల తెలియుచున్నది.

ఆల్కహాలు—మెదుడు.

ఆల్కహాలు వలన మెదుడు విశేషముగా జెడిపోవుననియు తన్మూలమున గొన్ని సమయములం దున్మాదవస్థయు వాటిల్లునని నివేదించి యుంటిని.

త్రాఁగినవాని చర్యలు చూచువారికి మిగుల చిత్రముగానుండుటయే కాక హాస్యజనకములుగా నుండును. ఈవిషయముల నన్నింటి మన మనుదినము గమనించుచుండుటచేఁ గొన్నివేళల మనకుఁ జిత్రమేమియుఁ దోఁచదు. నవ్వుట, లేక యేడ్చుట, తూగుట, అఱచుట, గానము చేయుట, ఆటాడుట, మొదలగు కార్యములు చిత్త భ్రమణముచేతనే కలుగును. ప్రొఫెసర్ క్రీపెలిన్ అనువారు కొన్ని సంవత్సరములు త్రాఁగు వారి యోచనాశక్తులను పరీక్షించి తుదకు త్రాఁగుబోఁతులు యోచనా హీనులై కార్యములం దాలస్యముఁ జూపుచుందురని సెలవిచ్చిరి. షిల్లరు అను కవీశ్వరుఁడు 'సారాయి నూతన నిర్మాణము చేయలేదని' పలికెను. 'హెల్మహోల్ట్సు' అనువా రిట్లు వ్రాసిరి. "సారాయి సూక్ష్మముగా గ్రహించినను యోచనా భావనాశక్తులు రెండును క్షీణించును." ఎప్పుడు చిత్తము చెడునో అప్పుడే నానావిధములగుదుష్కార్యములు ప్రాదుర్భవమొందును. ఏతత్కారణముచేతనే నేరములు విశేషమగును. స్వీడన్‌లో ౧౮౮౭-౯౭ వఱకు ౨౪,౩౯౮ గురి కారాగృహవాసులలో ౧౭,౩౮౪ గురు ఆల్కహాలుయొక్క కైపువలన నేరములు చేసినట్లు తెలియవచ్చుచున్నది. ఈ నేరముల విషయమై త్రాఁగుట హెచ్చినకొలఁది దుష్కార్యములు హెచ్చుట, అయ్యది తగ్గినకొలఁదిని నేరములను దగ్గుట మొదలగు విషయముల విపులముగా అమెరికాలో నిషేధకశాసనమువలన గలిగిన మార్పులను జర్చించుచో వ్రాయఁబడినది. కావున నిచ్చట దానిచర్చ మానినాడ.

కొందఱు శాస్త్రజ్ఞులు (Scientists) జంతువులపై ఆల్కహాలు శక్తియెంతటిదో చూడవలయునని కొన్ని పరీక్షలఁ జేసి చూచిరి. కొన్ని కుక్కలకు ఆల్కహాలుకలిపిన యన్నమును బెట్టుచుఁ గొన్నింటికి ఆల్కహాలునివ్వక కొన్ని దివసములు పెంచిన ఆల్కహాలుదినిన శునకములు బలహీనతనొంది నశింపఁ దొడగెనని తెలియవచ్చెను. ఇదేవిధముగ కొన్ని గ్రుడ్లలో ఆల్కహాలు బిందువుల విడిచియుంచగా పొదిగివచ్చిన కోడిపిల్లలలో కొన్ని బలహీనముగను, కొన్ని తెలివితక్కువయైనవియు, మఱికొన్ని మృతించినవియు నయ్యెను.

కావున అండగర్భముననుండిన పిల్లలయవస్థ యట్లైనప్పుడు గర్భవతులై యుండుస్త్రీలు ఆల్కహాలు త్రాఁగవచ్చునా యోజింపవలయును. బాల్‌క్లైన్ ౧౯౦౭లో నిట్లు పలికెను. తల్లులు ఆల్కహాలుకలిసిన సారాయిని త్రాఁగుటచే శిశువుల కపాయముగలుగును. బాలురు త్వరగా మృతినొందుదురు. అటుగాకపోయిన వారు సదా దుర్బలులుగా నుందురు. ఇదేవిధముగ ప్రసవమయిన పిమ్మట శరీరమం దుష్ణము కలుగఁజేయుటకును బలము నిచ్చుటకును ప్రకృతకాలమున మనదేశమున బ్రాండీ మొదలగువాని స్త్రీలకిచ్చుట వాడుకయైనది. పూర్వమిట్టి యాచారము మన ఆయుర్వేదవైద్యులచే ప్రచారమందుంచఁబడలేదు. కాని పాశ్చాత్యనాగరికత ప్రబలిన పిమ్మట నేడు బ్రాహ్మణగృహములందు సహితము దీని నిచ్చుట కొన్నిచోట్ల వాడుకయైనది. ఇప్పుడు పాశ్చాత్యవైద్యులే యీ

యాచారము చెడ్డదని నొక్కి వక్కాణించుచున్నారు. బ్రాందీ త్రాఁగిన చనుఁబాలు వృద్ధియగునని కొందఱి యభిప్రాయము. బ్రాందీలో పుష్టినిచ్చుపదార్థము లెవ్వియును గానరావని యింతకుమున్నె నివేదించియుంటిని. కావున దాని యభ్యాసముచే రక్తము చెడి, అజీర్ణము హెచ్చి, స్తన్యమును తగ్గించి, శిశువునకు హాని కలుగఁజేయును. బర్జి అను జర్మన్ శాస్త్రజ్ఞుఁడు తల్లుల పాలు సమృద్ధిగనుండని కారణమును చర్చించి యనేకవిషయములలో ఆల్కహాలే మూలకారణమని నుడివెను. ఉష్ణప్రదేశములలో దీనివాడుట యనేకవ్యాధుల కాహ్వానమిచ్చుట యని లేండను యభిప్రాయము. కలకత్తాలో రాజర్సు అను డాక్టర్ కార్జముయొక్క రోగములచేఁ గష్టపడువారిలో ౧౦౦-కి ౨౦ గురు త్రాఁగుటవలన వ్యాధిని తెచ్చుకొనినవారని వెల్లడించెను.

మహాశయులారా! ఆదికాలమునుండియు మితజీవనమునందు ప్రపంచమునకు దారిచూపిన మన ఆర్యావర్తము నేడు యీదుష్టాచారదంష్ట్రములం దగుల్కొని దినదినము నిస్తేజము నొందుచుండ మనమందఱము చేతులజోడించికొని యూరకుండుట పాడికాదు. మనలో మనము కలహించి భిన్నాభిప్రాయులమై, ఐకమత్యమును బరులకొసంగి, ధైర్యమును దేశచరిత్రముల కప్పగించి వాగ్వాదములందుఁ బ్రొద్దుపుచ్చుచుండుట శ్రేయస్కరముకాదు. లేండను హిందూస్థానమందలి ఆల్కహాలుప్రచారము హెచ్చుచున్నదని తెలుపు పుస్తకమున తుది నిట్లు వ్రాయుచున్నాడు. "దేశభక్తుఁడు తన జాతి శరీరమందు

యోచనాశక్తియందును, నీతియందును ప్రబలమై యుండవలయునని యభిలాషకన్న వేఱేదియుఁ గోరఁడు. ప్రతి హైందవుఁడును జాతీయశక్తి యణుమాత్రమైనను దురాచారములవలన క్షీణింపకుండునటుల ప్రయత్నింపవలయును. నవీనభారతశక్తి యీనూతన శత్రువును లోఁజొరనీయకుండ ద్వారమును బంధింపవలయును. ఇది శాసనమునకు మాత్రమే సంబంధించినది కాదు. ప్రతిమనుజునికిని సంబంధించినది. తమ ప్రియమైన మాతృభూమియం దీ మద్యపానము నిలువకుండునటుల దేశనాయకులందఱు నేకముఖులై శ్రమింప నిది మంచిసమయము."

స్వరాజ్యమునకై కష్టపడువారు కల్లు సారాయి మొదలగు వానిని శాంతమార్గమున మాన్పఁగడంగుచుండ మన మితవాదులేలనో మిన్నకున్నవారలు. స్వరాజ్యకపోతము బానిసత్వపంజరమునుండి వెడలి యొంటిఱెక్కతో మోక్షగగనమున నెట్లు సంచరింపఁగలదు.

కావున మితవాదులైన నేమి, తీవ్రవాదులైన నేమి, క్రైస్తవులైననేమి, బ్రాహ్మణేతరులైననేమి, అందరును సన్నద్ధులై బోధచేయవలయును. బ్రాహ్మణేతరులలోని జనులే ముఖ్యముగా త్రాఁగువారు. వీరిలాభమునకే మనవారిప్పుడు పాటుపడుచున్నారు. ఇట్టిసందర్భమున బ్రాహ్మణేతర సంఘనాయకులును, తమసాధనములైన పత్రికలును, నేవియో కొన్ని జారినమాటలతోఁ గాలముగడుపుట తప్ప ఇంకేమైనను విశేషము చేసినారాయని ప్రశ్నింపవలయును.

మన దేశమందు మద్యపానము

(౧)

"నేను ప్రథమమున నీదేశమునకు వచ్చినపుడు (౧౯౦౧ లో) యిట్లొక పుస్తకమున వ్రాసికొంటిని. 'వీథులలోఁ ద్రాఁగినట్టి హైందవు నొకతూరియైనను జూడలేదు? అయ్యో! ఇట్లే నేఁడు వ్రాయఁజాలను గదా!" [సి. యఫ్. ఆండ్రూసుగారు.]

మద్యపానమువలన శరీరమెట్లు చెడిపోవునో ముందు ప్రకరణమున తెలిపితిని. ఈ భాగమున మన హిందూస్థానమం దీదురభ్యాస మేరీతి పట్టువడినదో తెలిపెదను. దీనివిషయమును జర్చించుటకు ముందుగా మనదేశస్థితిని గుఱించియు జనులస్థితిని గుఱించియుఁ గొంత విశదపఱచెదను. ఆదికాలమునుండియు మన యార్యావర్త చరిత్రమును గుఱించి దేశీయులే కాక పరదేశాగతులైన వారప్పుడప్పుడు వ్రాసియుంచిన విషయముల వలన నీదేశము క్షీర మధుద్రవములతో సమృద్ధినొందినదని తెలియుచున్నది. చంద్రగుప్త చక్రవర్తికాలమున మెగాస్తనీసను గ్రీకుదేశపు చరిత్రకారుఁడు వ్రాసిన విషయముల గమనించినచో మనము ప్రపంచమందంతట నుత్కృష్టులమై యుంటిమని

తెలియవచ్చుచున్నది. అటుపిమ్మట మహమ్మదీయులు మన దేశము ననేక శతాబ్దములవఱకుఁ గొల్లగొట్టుచుఁ గుబేరులరీతి ధనములగడించిరి. ఆంగ్లేయాది పాశ్చాత్యు లీదేశమునకు వర్తకముచేయ వచ్చినపుడుకూడ మనభూమి సమృద్ధియం దోలలాడుచుండెను. ఇంగ్లీషు రాజ్యము స్థిరమైనపిమ్మట యేలో కాని క్షామములు బలమయ్యెను. పరదేశవర్తక మధికమాయెను. దేశమందు బీదలసంఖ్య మితిమీరెను. ఈవిషయముల విశేషముగాఁ దెలిసికొనఁగోరువారు మన యార్థికచరిత్రలను, 'డిగ్బీ' వంటి నిష్పక్షపాతులైన పాశ్చాత్యులే వ్రాసినట్టి గ్రంథములను జదివిన విశదమగును. తుదకు ౨౦ - ౩౦ వత్సరములనుండి యీదేశమందు దారిద్ర్యము హెచ్చినట్లు డిగ్బీ యిట్లు వ్రాయుచున్నాడు. హిందూస్థానపు జనుల యాదాయమును సాటుగా విభజించిన ప్రతివానివంతుకు సంవత్సరమునకు ౦-౪-౬ రు. ఆదాయము మిగులుననియు, నిదేవిధముగా నింగ్లాండు వారి యాదాయమును విభజించిన ప్రతిమనుజునకును సంవత్సరమునకు రు. ౬౩-౨-౬ మిగులుననియుఁ దెలిపినాఁడు. ఆహా! ఏమి యీ హస్తిమశకన్యాయము. ఇదేవిధమున ౧౦-౨౦ సంవత్సరములకుఁ బూర్వము మనదేశమున ౭ కోట్ల జనులు సంవత్సరాదినుండియు నంతమువఱకు నొకపూటనే భోజనముచేసి బ్రదికినవారని తెలియవచ్చుచున్నది. యుద్ధారంభమునుండియు దేశమంతట వస్తువులు చాల ప్రియమై బీదలకుఁ గష్టములు

గలుగఁజేసినవి. కూల్నా, చంపార్న్, దత్తమండలి మొదలగు ప్రదేశములలో నీసమయమందుఁగూడ క్షామమున్నదని యందఱకును దెలియునుగదా! ఇటీవల డాక్టరు హారోల్డుమాన్ (Dr. Harold Mann) అనువారు "దక్కను గ్రామములలో వ్యవసాయము"ను గుఱించి యొకగ్రంథమును వ్రాయుచు ననేక విషయముల వెల్లడించినారలు. 'బద్రూకు' అను గ్రామమును జర్చించుచు 'నీగ్రామమువలెనే దక్షిణ హిందూస్థానములో ననేకములున్నవి' అని తెలుపుచు దానిలోని సంగతుల నిట్లు వ్రాసెను. ఆగ్రామమందలి జనులు మూఁడుపాళ్లు వ్యవసాయమై బ్రదుకువారు. అచ్చట ౧౪౭ కుటుంబములు మొత్తమున ౨౪౯౬౩ రూపాయీల సంపాదించుచున్నవి. ఈప్రకారము విభజించినచోఁ బ్రతివాఁడును సంవత్సరమునకు రు. ౩౩-౧౨ అ. చొప్పున సంపాదించుచున్నాడు. ఇంక వారి జీవనార్థమై సంవత్సరమునకు మొత్తముమీద ౩౪౯౭౬ రూపాయీలు వ్యయమగునని తెలియుచున్నది. దీనిని విభజించిన ప్రతిమనుజునికి సంవత్సరమునకు ౪౭ రూపాయిల వ్యయమని తేలును. ఇట్టి స్థితియందు ప్రతివానికిని రు. ౧౨-౪ అ. తక్కువ యగును. కావున నీజనులు బ్రదుకవలయునని బాకీలుచేసి జీవింపవలయు. అప్పిచ్చువాఁడు సాధారణముగా సంవత్సరమునకు ౧౦౦-కి ౨౦ రూకల వడ్డీప్రకార మిచ్చును. ప్రకృత మాగ్రామమందుండు సాహుకారి ప్రారంభమున నిర్ధనుఁడై బొంబాయి మిఠాయి దుకాణములలోఁ బనిచేయుచు నాలుగైదేండ్లలో ౫౦౦ రూకల

గడించి యీగ్రామమునకు వచ్చి మిండ వడ్డీలకీ మొత్తము నిచ్చుచు ముప్పది సంవత్సరములలో ౨౧౦ యెకరముల భూమిని సంపాదించుటయేకాక నగదు ౫౦,౦౦౦ రూకల నార్జించె నట. ఈ ౧౪౭ కుటుంబములలో ౨౨ కుటుంబములు మాత్రము ఆదాయ వ్యయముల సరిపెట్టుకొని గుట్టుతో బ్రదుకుచున్నవి. తక్కిన ౧౨౫ కుటుంబము లెల్లప్పుడును ఋణముల పాలై నశించుచున్నవి. ఇట్టి యవస్థయందు మన పేదలుండ నింకను దేశము భాగ్యవంతముగా నున్నదని పల్కువారు నూతి కప్పలవలె జ్ఞానహీనతఁ బ్రకటించుకొనెదరు.

ఈ దేశమున కూలినాలిచేయువారు దరిద్రులు. వారే విశేషముగాఁ ద్రావువారు. వారియాదాయమే జీవనోపాయమునకై చాలనపుడు వారు త్రాఁగనభ్యసించినచో నప్పులపాలై కుటుంబములఁ బాడుచేసి సంతతిని, నాధ్యాత్మికాధి భౌతిక విషయములందు హీనస్థితియందుంచి పాతకమున కొడిగట్టుకొనినవారగుదురు. కావున మనమీ దురభ్యాసము నెంతశీఘ్రముగా నిర్మూలనముచేసిన నంతమేలును సమకూర్చిన వారమగుదుము. ప్రపంచమందు స్వతంత్రరాష్ట్రములన్నియు మెల్లమెల్లగా నీదుష్టాభ్యాసమును దగ్గించి నిర్మూలింపఁ బ్రయత్నముచేయుచున్నవి. కాని మనదేశమందుఁ బరాధీనకారణమున మనమార్గమంత సునుపైనదికాదు. సి. యఫ్. ఆంద్రూసుగారిట్లు వ్రాయుచున్నారు. "ప్రభుత్వమువా రింగ్లాండులో

మద్యపానమువలన నాదాయముకలదని దానిని వృద్ధిపఱచుచున్నారు. ఇంగ్లాండునుండి యీ కీడిండియా 'కెగుమతి' చేయబడినదియు మనకుఁ దెలియును. మఱియు నాంగ్లేయ సామ్రాజ్యము కల్లు, సారాయి వ్యాపారముచేతను, నల్లమందువ్యాపారముచేతను ముఖ్యముగా స్థాపించుకొనిన విషయముకూడ మనకుఁ దెలియును. బీహారు శాసనసభలో బహిరంగముగా మద్యపానమునుండి వచ్చుపన్నులే నిది రాజ్యాంగపరిపాలనము కానేరదని తెలుపఁబడుట యీ విషయములను బలపఱచును."

ప్రకృతము మనభూమియందుఁ గల్లు, సారాయి, నల్లమందు, భంగీ, బ్రాండీ మొదలగు పాశ్చాత్యవస్తువులును, విశేషముగా వాడఁబడును. చెట్లనుగీసితీయు మద్యములు, ఈతకల్లు, టెంకాయకల్లు. ఈ రెండును మనదేశమందు జనులచే మిక్కుటముగఁ ద్రావఁబడుచున్నవి. వీనిపిమ్మట సారాయి విశేషముగాఁ బ్రచారమందున్నది. బహుప్రదేశములలోఁ బెద్దపెద్ద భట్టీలుపెట్టి సిద్ధముచేయుచున్నారు. సారాయికి మారుగా నవనాగరికులు, బ్రాండీ, విస్కీ, వైన్ మున్నగు పాశ్చాత్యదేశములనుండివచ్చు సీసాలను విశేషద్రవ్యమును, వ్యయముచేసి, కొని, త్రావుదురు. నల్లమందు, భంగి, వీని నాదరించుజనులు గూడ బహుళముగ నున్నవారు.

సర్కారు 'లైసన్సు' పద్ధతుల నేర్పాటుచేసిన నాటగోలె క్రమక్రమముగాఁ ద్రాఁగువారిసంఖ్య వృద్ధియగుచున్నది.

౧౯౦౦-వ సంవత్సరమునుండియు సారాయి దుకాణములు యందలి యమ్మకములు మొదలగువాని పట్టీలఁజూచిన నీసంగతి బోధపడును. సర్కారు సవతి తల్లిచందమున దేశమునకెన్ని యో లాభములు చేయుచున్నందునకు గురుతుగాఁ గల్లు సారాయి యంగళ్లను దగ్గించి, బీదసాదలు త్రాఁగకుండుటకై ధరల నెచ్చించినామని తెలుపుచుందురు. ఈ యదార్థమీ క్రింది పట్టీల గమనించిన వెల్లడియగును.

ప్రభుత్వమువారు కల్లుదుకాణములుతగ్గించిన త్రాఁగుట తక్కువయగునని తలఁచిన దానికి దార్ఖాణ.

సంవత్సరము.	సారయి వగైరా దుకాణములు.	మత్తుపదార్థములు దుకాణములు.	మొత్తము.
౧౮౯౯-౧౯౦౦	౮౨౧౧౭	౧౯౭౬౬	౧,౦౧౮౩౩
౧౯౦౮-౧౯౧౦	౬౨౬౮౩	౧౭౧౨౨	౬౯౮౩౫

దీనివలన ౩౧౯౯౮ దుకాణములు తగ్గిపోయినవి. ఎంత శ్లాఘ్యాపాత్రము !!

ఇటులే ధరలకు నెచ్చించిన నిఱుపేదలు త్రాఁగరని నందుల గుఱుతు.

మధ్యాదులవలని సర్కారున కాదాయపు రూపాయలు.

ప్రదేశము	౧౯౦౮-౧౯౦౯	౧౯౧౮-౧౯౧౯
మధ్యపరగణాలు, బీరారు	౬౬౧౫౦౦౦	౧౨౩౫౪౦౦౦
ఆగ్రా, అయోధ్య	౮౫౬౨౦౦౦	౧౫౯౩౦౦౦౦
పంజాబు	౪౭౫౯౦౦౦	౯౮౩౧౦౦౦౦
మద్రాసు రాజధాని	౨౫౪౪౨౦౦౦	౪౬౪౪౩౦౦౦
బొంబాయి రాజధాని	౧౬౮౫౪౦౦౦	౩౭౮౨౭౦౦౦

చాలవఱ కన్ని ప్రదేశములలో నెచ్చుతక్కువగా నీ పదేండ్లలో నాదాయము రెట్టించినది.

ఇవ్విధమున ధరలెచ్చినను త్రాఁగుట తక్కువయైనదా యని ప్రశంశించిన నీ క్రిందిపట్టికయే, సాక్ష్య మిచ్చుచున్నది. అన్యదేశములనుండి మనదేశములోనికిఁ బంపఁబడిన బ్రాండీ, సారాయి, ఏల్, విస్కీ, వైన్ వగైరాల మొత్తము :—

౧౯౦౧-౧౯౦౨	౪౯౬౧౧౫౬	గ్యాలన్లు.
౧౯౧౧-౧౯౧౨	౫౭౧౮౧౩౭	గ్యాలన్లు.

అనగాఁ బదిసంవత్సరములలోపలనే ౭౫౬.౯౮౧ గ్యాలన్ను లెక్కువయైనవి.

మనదేశమందు సిద్ధముచేయఁబడిన సారాయి యెంత ఖర్చైనదో చిత్తగింపుఁడు.

మద్రాసులో	౧౯౦౧-౧౯౦౨ లో	౮,౭౫,౭౫౫	గ్యాలన్లు.
,,	౧౯౧౧-౧౯౧౨ లో	౧౬౨౮౧౭౭	,,
బెంగాలులో	౧౯౦౧-౧౯౦౨ లో	౬౦౮౨౯౮	,,
ఒరిస్సాలో	౧౯౧౧-౧౯౧౨ లో	౧౮౭౬౩౯	,,

దీనివలన మద్రాసు 'కోస్తా'లో సుమారు రెండంతలు బెంగాలురాష్ట్రములో రమారమి మూఁడంతలును త్రాఁగుటవృద్ధియయ్యెనని యజ్ఞానునికిఁగూడ బోధపడుచున్నది. మున్ను త్రాఁగువారిప్పుడు హెచ్చగు ధరలనిచ్చి మూఁడంతలు త్రాఁగరుకదా? ఏవస్తువైనను మునుపటికన్న చాల ప్రియమైనదైనచో దానిని గోరువారు చౌకయగు ధరలుండినపుడు కొనినట్లు విశేషముగాఁ

గొనరు. యుద్ధకాలమునందు యూరోపునందేమి, ఇండియా యందేమి, జనులందఱును మితజీవులై యుడుపులఁ జాలకాలము వఱకు ధరించుచుండిన యంశమందఱకును విదితము. కావున క్రయమధికమైన ప్రతిమనుజుఁడును మూఁడుముంతలు త్రాగు చోట రెండింటినే పీల్చిపోవును. ఇట్లు జరిగినయప్పుడు త్రాగుట యొక్క మొత్తము తగ్గియుండ వలయునుగాని, అనేకగ్యాలన్లు త్రాఁగఁబడెనని తెలిపినప్పుడు త్రాఁగువారు విశేషముగా దుకాణములకేగుచు నీమొత్తమును వృద్ధిపఱచియుండవలయును. నేఁటి వఱకును వస్తువులన్నియు జాలప్రియమైనను తాగువారి సంఖ్య యింకను వృద్ధియగుచున్నటుల ప్రచురణశాఖవారు (Publicity Bereau) ఈ సంవత్సరపు నవంబరు మాసములోఁ బ్రచురించినారలు. ఆబ్కారీబోర్డువారు ౧౯౨౧-వ సంవత్సరము వఱకు సారాయి మున్నగు నవేవిధముగ దేశమందుఁ బ్రచారమందుండినవో తెలిపినారలు. స్వదేశమందలి మద్యములు (Country liquors) ౧౦౦-కి ౬ వంతున (౬%) త్రాగుట హెచ్చినదనియు జనసంఖ్య ౧౦౦-కి ౨ వంతననే హెచ్చినదనియుఁ దెలిపినారలు. "అయితే త్రాఁగుటపై పన్ను హెచ్చింపకుండిన యింకను వృద్ధియై యుండుననుటకు సందేహము లేదు"అని మన ప్రచురణశాఖవారు వ్రాయుచున్నారు. త్రాఁగ నేర్చినవాఁడు తన యిల్లాలిపైనుండు తాళిబొట్టును సైతము గుదువఁబెట్టి త్రాఁగివచ్చును గాని పన్నులను వెఱబొమ్మలఁజూచి

నాఁడు వెనుకంజ వేయునా? ఈ పదిసంవత్సరములలో ౧౯౧౦-౨౦ వఱకు నన్యదేశములనుండి వచ్చిన మద్యముల (Foreign liquors) పై పన్ను నాలుగులక్షలెక్కనదని తెలుపుచున్నారు. "విద్యనేర్చిన దేశస్థులలో నీ యభ్యాసము వృద్ధియగుచున్నదని చెప్పుటకుఁ గారణము లున్నవి" అని వ్రాసి "అయినను దీనిరుచిని మాన్పుటకుఁ బ్రయత్నించుచున్నాము" అని సెలవిచ్చిరి.

వీరేమిచేయుచున్నారో వీరికే తెలియును. అన్యదేశములనుండివచ్చునట్టి యీ మద్యముల రానీయకుండుటే కర్తవ్యము. దీనికన్న వేరుప్రయత్నములేదు. ఇంక కల్లువిషయము. ఇదికూడ యెంకమువంతు విశేషమైనదని బోర్డువారొప్పుకొనినారలు. అయితే దానికి వెంటనే కారణముగూడ కనఁబఱచినారలు. వృక్షము లెక్కువగా గీయఁబడుచున్నవని చెప్పిరి. ఇంతకుమున్ను దుకాణముల తగ్గింపవలయునని చెప్పుచుండిరి. కాని యిప్పుడు సంఘమునకుఁ గావలసినంత యమ్మకమునకై దుకాణముల వృద్ధిచేయవలయునని చెప్పుచున్నారు. ఈసూచనలన్నింటినిజూడ మనకు సర్కారుపక్షమునుండి లాభములు కలుగవనియు, నీయభ్యాసము తక్కువయగుటకు మారుగా వృద్ధియగుచున్నదనియుఁ దెలియును. ౧౯౦౧-వ సంవత్సరమునుండియు నీవిషయముల శ్రద్ధతో గమనించిన సి. యఫ్. ఆండ్రూస్ గారిట్లు వ్రాయుచున్నారు.

"మద్రాసుకూలీలలో, పెరంబూరులో విశేషముగాఁ ద్రావుట చూచినాడ. బొంబాయిలో నిది క్రొత్తసంగతికాదు. ఈ హేయకార్యముల జిల్లాలలో పలగూడ చూచినాడ. ఇండియనుస్త్రీలుగూడ కైపెక్కియుంటఁ జూచితి. ఇంతియకాక బెంగాలులో నేనుండు జిల్లాలలోనే గ్రామములన్నియు రెండు కారణములచే క్షీణించుచున్నవి. (౧) మలేరియా జ్వరము. (౨) మద్యపానాభ్యాసము." ఇట్లనేకు లభిప్రాయ మిచ్చుచున్నారు.

నల్లమందు

(౨)

మద్యపానాదులలో నెల్ల సర్వానర్థదాయకమైనట్టిది నల్లమందు. ఈ నల్లమందు మనదేశమందేకాక చైనాయందుఁ గూడ మిక్కుటముగా నుపయోగింపబడుచున్నది. ఈనల్లమందు వ్యాపారమువలన హిందూస్థానమునకుఁ బ్రతిసంవత్సరమును పన్నుమూలకముగా నాదాయము వచ్చుచున్నది. హిందూస్థానమందుఁగాక యితరదేశమందలివ్యాపారమందు వచ్చుపన్ను

౧౯౧౪-౧౫	నందు	౧,౫౭౨,౨౧౮	సవరన్లును.
౧౯౧౫-౧౬	,,	౧౯౧౩౫౧౪	,,
౧౯౧౭-౧౮	,,	౩,౧౬౦౦౦౫	,,

ఇటీవల ప్రచురించిన యొకపుస్తకమం దిట్లున్నది. "హిందూస్థాన చీనాదేశములందలి నల్లమందు హక్కు ఇండియాగవర్న

మెంటునకు లాభము కలిగింపవలయుననియే యేర్పాటుచేయఁబడినది." 'లామోట్' అనకన్య యిట్లు వ్రాసియున్నది. "మేము జపానుకరుగునపు డొకహిందువు మాతో మాట్లాడుచు నల్లమందు వ్యాపారము ఇండియా ప్రభుత్వబలమున సాగుచున్నదని చెప్పెను. 'మాకు స్వరాజ్యములేనిది మేమీ వ్యాపారనిరోధనమును జేయ శక్తులము కాము' అనియుఁ బలికెను. ఈ విషయములు మేము పరిశీలించిన పిదప నిశ్చయమైనవిగా నెఱిఁగితిమి.

యూరపుఖండమందును, అమెరికాదేశమందును మద్యాదుల వ్యాపారమును దగ్గింప ప్రయత్నములు జరుగుచుండ నీ ప్రాక్భాగమున వేరువిధము లాచారమందున్నవి. ప్రభుత్వము వీని యమ్మకమున కన్నివిధముల సహాయ మొనరించుచున్నది. జపాను ఫిలిప్పైను దీవులు - స్వతంత్రశక్తి కలవగుటచే నీరెండు మాత్ర మీమార్గ మవలంబింపలేదు. మిస్‌లామోట్-ఇంకను ననేకవిషయము వెలిబుచ్చుచున్నది. స్టేయిటు సెటల్మెంటు యొక్క ౧౯౦ లక్షుల డాలర్ల పన్నులో ౯౦ లక్షుల డాలర్ల పన్ను ఇండియానుండి యెగుమతియగు నల్లమందుపై వచ్చుచున్నదని యుహాంకాంగులోఁ బన్నులో మూఁడవవంతు ఇండియా గవర్నమెంటుద్వారావచ్చు నల్లమందువలనవచ్చుననియు దెలుపుచున్నది. చీనాదేశములో నల్లమందు నణఁచుప్రయత్నములకు ముఖ్యప్రతికూలము మిండియా ప్రభుత్వమునుండివచ్చు

నల్లమందేయని వ్రాయుచున్నది. హాంకాంగులో ౫ లక్షల జనులే యుండగా ౧౫ కోట్ల జనులకుఁగావలసినంత నల్లమందు దచ్చుటకుఁ బంపఁబడుచున్నదఁట. ఈ హాంకాంగునుండి చీనాలోనికి రహస్యముగా వర్తకులు నల్లమందును గొనిపోయి యమ్ముదురఁట. సింగపూరులో నీకన్యారత్నము నల్లమందు దుకాణములఁ జూడఁగోరి యచటకేగి యొక ముదుసలి నల్లమందుగోలీలఁ దినుచుండ చూచెనఁట. ఆవృద్ధుఁడీ యమను గాంచినపుడే సిగ్గుచే గోలీని దాఁచుకొనెనఁట. "వాఁడేల తినుట మానెను" అని యీయమ ప్రశ్నింప, వెంట పోయినవాఁడు "మీరు చూచుచుండ వీఁడు సిగ్గుచెందెను" అని ప్రత్యుత్తరమిచ్చెనఁట. అంత లామోటిట్లుపలికెను. "బ్రిటిషుప్రభుత్వమే నల్లమందమ్ముటకు సిగ్గుపడినదికాదు. వాఁడుమాత్రమేల సిగ్గరియై యున్నాఁడు." ఇంకొకచో నాకన్య యిట్లు వ్రాయుచున్నది. "తెల్లజాతివారినేల రక్షించుకొనుచు, చీనావారిని నల్లమందు కాహుతియొనర్చినారు. ఏమీ! తెల్లవారే ప్రపంచమందుండుటకుఁ దగినవారా? పరిపాలనయందుండువారు రక్షణానర్హులా?" మొరిషస్ అనుద్వీపమందు ౩౭౭౦౦౦ జనులలో ౨౫౮౦౦౦ జనులు హిందూస్థానపువారున్నారు. ఆ ప్రదేశమునకు

౧౯౧౨-౧౩ న సం॥ ౧౩ నల్లమందుడబ్బాలును
౧౯౧౩-౧౪ న ౧౯ ,,
౧౯౧౬-౧౭ న ౧౨౦ ,,

నీరీతి సంవత్సర సంవత్సర మెక్కువగాఁ బంపించుచుండుటచే మనవారుకూడ యీ యభ్యాసమం దారితేరినవారైనట్లు కనఁబడుచున్నారు. ఇట్టి విషయములనన్నింటిని జూపించుచు మిస్ లామోటుగా రిట్లు వ్రాయుచున్నారు—"షన్ను కొఱకై ౩౦ కోట్ల శక్తిహీనులైన యిండియనులను లోఁబఱచుకొని, మద్యాసక్తులనుగాఁ జేయ సమర్థత గల్గిన జాతి యుద్ధసంరంభమందు సైతము చేయనట్టి కరుణాహీనమైన క్రౌర్యమును జేసినది యైనది."

ఈ యమవాక్యములు సత్యాగ్రహములతోఁ గూడిన యాంగ్లప్రభుత్వనిశ్చయస్థితిని బ్రపంచమునకంతయుఁ జాటుచున్నవి. సి. యఫ్. ఆండ్రూసుగారును, నీ యమయు, సత్యాన్వేషణపరాయణులు. జాతి పక్షపాతమూని తప్పులున్నను నొప్పులేయని యొప్పనివారి సైతము మెప్పింపవలయునని స్వార్థకుతూహలముతో నుండువారు కారు.

చదువరులార! దేశక్షేమమునకై పాటుపడఁదలఁచిన వారందఱు నిట్టిదుస్థితినిగని యుపేక్షచేసిన లాభములేదు. మన దేశమం దక్కడక్కడ మితసంఘములని (Temperance Associations) పేరుపెట్టుక కొందఱు మనఃపూర్తిగ శ్రమించుచున్నారుకాని వారివలన మనకు లాభములంతగాఁ గలుగలేదు. శాసనసభలందును నప్పుడప్పుడు కొందఱు దేశభక్తులు ప్రభుత్వము నెచ్చరించి వారిచే దుకాణముల దగ్గించుచు, ధరల

నెచ్చించుచు, మరల పన్నుల హెచ్చుగాఁ జేసిరేకాని వేరు లాభములెవ్వియు మనకు సమకూర్పలేదు. ఇటువంటిస్థితి యందు మన కర్తవ్యమేమని యాలోచింపవలయును. ఈమద్యపాన వ్యసనసంహారసాధనముల నాలోచించుటకు ముందుగ నితరదేశములం దీవ్యాధి నెట్లుతొలగించిరో చూపించెద. ముఖ్యముగా నమెరికాయొక్క చిత్రమైనమార్పును వర్ణించెద. అటుపిమ్మట ఇంగ్లాండు, యూరపుదేశములేమి చేసినదియుఁ దెల్పెద. తుదకు మద్యపానమువలన మనదేశమున కెట్లు నష్టములు కలుగునో దాని నిర్మూలించుటకు పలువురు పలువిధముల నూహాలుచేసినవిధములను, నందే యేవిషయములు గమనింపఁదగినవియో తెలిపెద.

మన జాతీయమహాసభ (National Congress) చేసిన ప్రయత్నములందఱకుఁ దెలిసియున్నను నొకింత వా రేర్పాటు చేసినమార్గమును గుఱించియుఁ జర్చించెద.

అమెరికాలో నిషేధము

(౧)

నిహాలుసింగు కొలదికాలమునకుమున్ను అమెరికాయెట్లు మద్యపానమును నిషేధించెనో తెలుపుటకై యొక గ్రంథమును వ్రాసెను. అందలి ప్రతిపంక్తియు చదివి గమనింపఁదగినదే. అయినను ప్రకృతమున నతిసూక్ష్మముగా నందుండు విషయముల వివరించెద.

శ్వేతముఖులు అమెరికాలోఁ గాలుపెట్టకమున్ను అచ్చట నుండు 'రెడ్డిండియను' అనువారికి మద్యపానమన్న నెట్టిదో తెలియదు. ఈ తెల్లవారచటఁ ప్రవేశించినఁ నాటినుండియు నాప్రదేశ నివాసులను ప్రోత్సహించి వారికిఁ ద్రాగనేర్పి వారి ధనమును గొల్లవెట్టుచు జీవనముల నాశనము చేయఁదొడఁగిరి. ౧౭౯౨ సంవత్సరమున ఈ నివాసులనాయకుఁ డిట్లుపలికెను. "ఈ దురభ్యాసము మాలోఁ బ్రబలిన నాటినుండియు మా తెలివి క్షీణించినది. ఆరోగ్యము నాశనమైనది. ప్రాణములు పాడైనవి. ఈకీడు తుపాకికన్నను ఖడ్గముకన్నను భయంకరముగ నున్నది." ఈ యరణ్యవాసులు వేటాడి గృహాభిముఖులై వచ్చునప్పుడీ తెల్లవారు వారికి బ్రాందీ ఇత్యాదుల నీయఁబోయిన వారు వలదన్నను దుగతిగమారులు వారిని బలవంతపెట్టి యూరకనే

యిచ్చి తెలివితప్పువఱకుఁ ద్రాపుచుండిరఁట. వారు మత్తిల్లి నేలగఱచి మరలఁ దెలివినొందువఱకేమి జరిగెనో కనుఁడు. పూర్వపుఁ దెల్లమోము లాదిక్కునగానరావు. ఈఁ త్రాగినవారి తుపాకి, పైదుప్పటులు, వలువలు మాయమైనవి. ఇట్లు పాపమా సజ్జనులు మద్యపానమునకు దాసులై దినదినము క్షీణింపఁ దొడఁగిరి.

అమెరికాలో యూరోపియనులు ప్రబలులై యేకసంఘమువారై అమెరికనులను నామమునొంది రాజ్యస్థాపన చేసిన పిమ్మట ౧౮౨౦ సంవత్సరమున ఆదేశమున కొన్నితావుల మద్యపాన నిషేధవిషయమై చర్చజరుగ ప్రారంభించెను. అది మొదలుగ ౧౯౧౮ వఱకు దేశమంతయు నేతన్నిర్మూలనార్థమై వివిధప్రయత్నములు చేయుచుండెను. "శ్రేయాంసి బహువిఘ్నాని" యన్న వాక్యము నిక్కముకాదా? ఈ సత్ప్రయత్నమునకనేక విఘ్నములు గలుగుచుండెను.

(౧) మద్యాదుల నమ్మువారు మహాధనికులు. ఈ ధనమూలమున నెన్నియుపాయముల నీసంస్కార తరంగములకు వెలల నిర్మింపవలయునో అన్నింటిని జేసి చూచినవారు.

(౨) వీరికిఁదోడు రాజ్యాంగముల నుద్యోగము చేయువారు. వీరు స్వలాభముచేతనో లేక లంచములకు లోఁబడియో, అటుకాక రాజ్యమున కాదాయముతగ్గునని దేశక్షేమాభిలాషతోటచేతనో, లేక ఈకారణములన్నింటిచేతనో, ఈనర్తకులకు సాయమొసగిరి.

(3) వీరితోఁబాటు కూలినాలిచేసిబ్రదుకు జనులు. వీరి సంఖ్య యేదేశమందు ముఖ్యమైనది. ఇంతయకాక తలఁచుగా వీరికొఱకే సంస్కారములన్నియుఁ జేయఁబూనుట. వీరిక్షేమమే దేశాభివృద్ధి. వీరినాశనమే దేశనాశనము. ఇట్టిజనులు 'సిరి రామోకాలొడ్డిన' రీతిమేలుచేయు హస్తమును ఖండింపఁబూనువారు. అమెరికాలోని యీజనులే "వోట్ల" అధికారులు. ఇట్టివారు ప్రతికూలులైన చట్టములు కానేరవు.

ఈమూఁడంశములు ప్రకృతము మనహిందూస్థానమున గానవచ్చుచున్నవి. (౧) ఈడిగవారు "బుడ్లకొలంది త్రావి కడుపుల్ గఱుబెంచి వివేకహీనులై యెడ్లవలెఁజరించు గుణహీనుల" ద్రవ్యమునుదోచి 'వరాలుగడించి' యిప్పుడు లాభమున కవకాశము లేదుకదాయని యడ్డకాలు వేయుచున్నారు.

(౨) సర్కారుపక్షమున వాదించు మహాశయులనేకులు 'సర్కారు ఆదాయము చాలతగ్గును. అంత రాజ్యాంగ పరిపాలనము జరుపుటకష్టము' అని వాదించుచున్నారు.

(3) త్రాగుబోతులనేకచోట్ల వారికి బుద్ధిచెప్పవచ్చిన పెద్దలపై ప్రోత్సాహముచే నేరములమోపి న్యాయస్థానముల శిక్షితులగునట్లు చేయించుచు కృతఘ్నులై యున్నవారు. ఈవిషయమై వేరుచో విశేషముగా జర్చింపఁబడును. అమెరికాలో వ్యతిరేకాభిప్రాయులైన యీజనుల తమపక్షము త్రిప్పుకొనుటకు బహువిధప్రయత్నములు చేయఁబడినది. ఈవిషయమును

గురించి విశేషముగోరువారు 'పుస్సీఫుట్టు జాన్సన్'గారి జీవిత చారిత్రమును జదివిన విశదమగును. ఈజాన్సన్ ముఖ్యముగా నమెరికా యభివృద్ధికిఁ గారణభూతుఁడు. వార్తాపత్రికలు-ఏవో యొకటిరెండు తక్కఁ దక్కినవన్నియు మద్యముల నమ్మువారిచేఁ బోషింపఁబడినవై వారిపక్షమే సదా వాదించుచుండ, జాన్సన్ బహు చమత్కారముగా, మారుపేరు పెట్టుకొని తానొక వర్తకుఁడనియు పాననిషేధము చేయువారి నేరీతి జయింపవలయునో యభిప్రాయములనిండని వార్తాపత్రికలకు వ్రాయ వారు వంచితులై తమ లోపములన్నింటిని చాటించుకొనిరి. ఇట్లు వార్తాపత్రికల యథార్థమును లోకులకు వెల్లడించి వారికి బోధచేయదొడఁగెను. బీదవారికెన్ని విధముల మద్యాదుల నష్టముల్ఁ జూపింపవలయునో యన్నిరీతుల చిత్రపఠముల చేతను, నుపన్యాసముల చేతను, వారికిఁ దెలియబఱచుచు ౧౯౧౦ సంవత్సరము నాటికి నర్థరాష్ట్రమును నిషేధపక్షమునకుఁ ద్రిప్పెను. ౧౯౧౭ సం॥న నిషేధించువారిపక్షమున ౨౮౨ వోట్లును, మద్యపానమును గోరువారిపక్షమున ౧౨౮ వోట్లును నీయఁబడెను. ౧౯౧౮ సం॥న సెనెటులో ౨౮ వోట్లు నిషేధించుచు, ౫ వోట్లు ప్రతికూలించుచు శాసనమును తీర్మానించెను. ఇవ్విధి దినదినము మద్యములపక్షము వాదించువారి సంఖ్యతగ్గెను. తుదకు ౧౯౧౯, జనవరి ౨౯-వ తేదిన అమెరికాదేశమందు మద్యముల వాడకూడదనియు, అమ్మకూడదనియు, నితర దేశములతో నీవ్యాపార మేమాత్రము చేయకూడదనియు, తీర్మా

నింపఁబడెను. ఈశాసనము స్థాపింపఁబడినపిదప మద్యములనమ్మువారి తిత్తులలోనికిఁ బారుచుండిన ద్రవ్యప్రవాహ మొకింత వైద్యుల జోబీలలోనికిఁ బోఁజొచ్చెను. త్రాగువారు సందు దొఱకిన చాలుననుచుఁ దమకు వ్యాధులగలిగినవనియు వైద్యులకు లంచములిచ్చి బ్రాందీ మొదలగు మందుల నాచికిత్సకై పుచ్చుకొనఁ దొడఁగిరి. అంత జూన్ ౧౯౨౧ వత్సరమున ౮౦,౦౦౦ అమెరికావైద్యులు సభఁజేసి యిట్లు తీర్మానించిరి.

"ఆల్కహాలుకలసిన మద్యములఁ గొందఱు వైద్యులు రోగనివారణకిచ్చుటచే మావృత్తికి దుష్కీర్తివచ్చినది. కావున మేమీమార్గము చెడ్డదనియు, అనవసరమైనదనియు నిశ్చయించినారము."

అప్పటినుండియు త్రాగువారి కేమియు దొఱకక పోయెను.

(౨)

ఇవ్విధమున అమెరికాలో మద్యమడుగంట నశించిన పిదప యాదేశము నెట్టిమార్పులు సంభవించెనో కనుఁడు. రైలుకంపెనీ అధికారులందఱును దమ దగ్గఱనుండు సేవకులెప్పుడును మద్యపానము సేయకూడదని శాసించియుండ "లాకవన్నా రైలురోడ్డుకంపెనీ" యనునది మాత్ర మీశాసన మనుసరింపకపోయెను. అంత నొకనాఁడు రైలు నడుపువాఁడొకఁడు కైపెక్కినటుల త్రావి రైలునడిపించుటయందుఁ బ్రమాదము గలిగించెను. ఆసమయమున ౭౧ ప్రయాణికులు మృతినొందు

టయేగాక యనేక నష్టములు కలిగెను. ఆ కంపెనీవారు ౧,౫౦౦౦,౦౦౦ డాలర్ల నష్టము కట్టియిచ్చిరి. ఒక్క మద్య పాన మదోన్మత్తుని కావరమున కంపెనీకంతయు నెంత వచ్చెనో గమనింపుఁడు. అదిమొదలుగ నీకంపెనీవారును మద్యము నిషేధించిరి.

బ్రాండీమొదలగు వస్తువులు బార్లీ,గోధుమలు, చక్కెర, ఫలములు మున్నగువానిచే సిద్ధము చేయఁబడుచుండుటచే ప్రప్రథమమున సేద్యగాండ్రు తమకు సరకమ్మకము లేక నష్టము వచ్చునేమోయని భయపడిరి. కాని యిట్టివిపరీతము లెవ్వియు జరుగలేదు. యథావిధిగ నీధాన్యఫలములు భోజనమునకై వ్యయమగుచుండెను. "నేషనల్ డైరీ యూనియన్" అను సంఘపు కార్యదర్శి యిట్లు వ్రాసెను. "సారాయిదుకాణములలో వ్యయమగుచుండిన ప్రతిడాలరును (నాల్గురూపాయీల నాణెము) ఇప్పుడింటి వెచ్చమునకై యుపయోగింపఁబడి పిల్లలకుఁ బాలుకొనుటయందు వినియోగింపఁబడుచున్నది.

"విస్కీ తగ్గినకొలఁది పాలు త్రావుట హెచ్చినది.

"సారాయి యంగళ్లు మూయఁబడినకొలఁదిని ఆవుల యభివృద్ధియు, దల్లులక్షేమమును వృద్ధి యగుచున్నది."

ఇంతియకాక త్రాగువారు తమకును, నింటివారికిని, నుడుపులులేక చింపిరిగుడ్డలతో నుండుటకు మారుగా నిప్పుడు సమృద్ధిగా వలువల ధరించుకొనుచున్నారు. కంసాలులు సొమ్ము

లు విశేషముగాఁ జేయుచున్నారు. 'సినిమా' నాటకములకు బోవువారు దినదినము హెచ్చగుచున్నవారు. మద్యమందు వ్యయమైన ద్రవ్యము పుస్తకములు గొనుటయందు వినియోగింపఁబడుచున్నది. కూలిచేయువారి తల్లులు, భార్యాపుత్రులు నేఁడు కష్టములను దాఁటి యజమానులు తెచ్చుపైకముతో సుఖపడుచున్నారు.

(ఈ సందర్భమున మనదేశమున నొకచో జరిగినవృత్తాంతము నాకు జ్ఞాపకమునకు వచ్చుచున్నది. కర్నూలులో ౭, ౮ మాసములకుఁ బూర్వము దినదినమును రాత్రి కాలమందు మహమ్మదీయులు సభచేసి మౌల్వీల "వాజ్" మతబోధ వినుచుండిరి. ఈ మౌల్వీలు కల్లు, సారాయి చెడ్డవని బోధించుచుండిరి. అంత నొకనాఁడొక సాధ్వి ముఖముపై 'బురఖా' వైచుకొనియే సభాధికారుల దీవించుచు నిట్లుపలికెను. "మహాత్ములార! యీయుద్యమమునకు దేవుఁడు తోడ్పడుగాత! ఈమధ్య నాభర్త త్రాఁగుటమానెను. నన్ను గొట్టుట మఱచెను. నాకష్టములును దగ్గెను. మేముసుఖముగా జీవించుచున్నారము." ఇట్లు నుడివి వెడలిపోయెను.)

ప్రకృత మమెరికావిషయము.

కూలీలస్థితి—కూలిచేయువారికి సమృద్ధిగాఁ గూలిపనియు దొఱకుచున్నది. పూర్వము సారాయి భట్టీలకై యొకచో వినియోగించిన ధనముతో ౭౭ గురు మాత్రమే పనిచేయు

చుండిరి. ప్రకృతమదే ధనముతో వేరు వ్యాపారములందు సుమారు ౫౦౦ గురు బ్రతుకుచున్నారు. త్రాగువారు మును తాము సేయుపనికన్న నిప్పుడెక్కువగ కృషిచేయుచున్నారు. దానిచే సంపాదనయు హెచ్చినది. త్రాగునపుడు వారమునకు ౧౪ డాలర్లు (సుమారు ౫౦ రూపాయీలు) సంపాదించు వారిపుడు వారమునకు ౨౫ డాలర్ల (సుమారు ౧౦౦ రూపాయలు) గడించుచున్నారు. ఇట్లాదాయ మెక్కువ వ్యయము తక్కువయగుటచే నీ జనులు తమ సంపాదించిన మొత్తము 'బ్యాంకు' (Bank) లో దాచియుంచుచున్నారు. ఏతత్కారణమున బ్యాంకుల సంఖ్యకూడ వృద్ధియైనది. పోర్టులెండు బ్యాంకులోని మార్పులఁగనుఁడు.

౧౯౧౪	సం॥న బ్యాంకులో నుంచిన మొత్తము.	౫౬౮౮౮౪౦౧౮	డాలర్లు.
౧౯౧౬	,,	౬౪౯౯౯౫౨౪౧	,,
౧౯౧౭	,,	౮౬౮౩౩౧౪౨	,,
౧౯౧౮	,,	౧౩౪౯౯౮౦౯౨	,,
౧౯౧౯	,,	౧౬౫౯౫౦౮౨౦	,,

ఈ సంఖ్యలే జనులయభివృద్ధిని గుఱించి సాక్ష్య మిచ్చుచున్నవి.

సంఘముపై మార్పులు:—త్రాగుడు యిప్పుడు మార్పు చెందినది. పూర్వము బ్రాందీ ఇత్యాదులు త్రాగువారిప్పుడు కాఫీ, టీ, పాలు, సోడా ప్రభృతులను ద్రావుదురు. అన్నిటి కన్న మిన్నయగు మార్పొకటి కలిగినది. మద్యపానము వెంటనే వ్యభిచారముకూడ వెడలిపోయినది. ఈ రెంటికి నెంత బద్ధసఖ్యమో పాపము! "అమెరికాయందు రాత్రి యొంటిఘంట

వఱకు నీవు వీథులందుఁ దిరుగవచ్చును, కాని ప్రత్యేకముగా నభిలాషతో వెదకినకాని నీకు వ్యభిచారిణులు దొఱకరు."

దంపతులకలహములు తిన్నతిన్నగా శమించుచున్నవి. నేలబొగ్గు గనులలోఁ బనిచేయువాని యిల్లాలొకతకష్టముల భరింపనోపక ౧౯౧౬ సం॥న నదిలోఁబడి చావ యత్నించెనుగాని రక్షింపఁబడెను. అంతలో నిషేధశాసనమురాగాఁ గుటుంబమంతయు నిప్పుడు సుఖముగా నభివృద్ధిచెందుచున్నది.

'లివింగ్స్టన్' అనునతఁడు తాఁ గన్నయంశమొక్కటి యిట్లు తెలుపుచున్నాఁడు. "ఒకనాడు మంగలివానిదుకాణములో నేఁ గూర్చునియున్నతఱి యా మంగలి నిషేధశాసనముపై నా యభిప్రాయమునుగోర దానివలన విశేషలాభము లింకను గనుపింపలేదని పల్కితిని. అంత వాఁడిట్లు ప్రత్యుత్తరమిచ్చి నా కాశ్చర్యముగలిగించెను. 'అయ్యా, నేను గడచినవత్సరమున మద్యపానమును మానవలయునని నేర్పువారిని హింసించుటకు సిద్ధముగానుంటిని. ఇప్పుడో వారితో నాకేమియు జగడము లేదు?

'ఏల?'

"నాదగ్గఱయుండు పైకమంతయు త్రాఁగుటలో ధ్వంసమగుటకతన నా కుటుంబము పోషణలేక దుస్థితియందుండెను. నాకు భార్యయు ముగ్గురుకొమారులును గలరు. నేను విస్కీని ద్రాగి పసరమువలె గృహమునకేగి యింటితెఱవనుగొట్టి భయపెట్టి యొక్కొకమారిలు వెడల నడచుచుంటిని. ఇప్పుడు

బ్యాంకులో ౧౫౦౦ డాలర్లు సంపాదించి యుంచినాఁడ. నాకుటుంబమునకు బట్టలు తిండియు సమృద్ధి. నాపిల్లలు సైతము నావలెనే పశువులై యుండియుందురుగదాయని యిప్పుడు తలఁచుకొని యదరిపడుదును. మేమొక గృహమును గూడ కొనవలయునని వెదకుచున్నాము. అయ్యా! నామాటల నమ్ముఁడు! అమెరికా యింతవఱకు చేసినకార్యములలో నియ్యది తుల లేనిది. దీనిమూలమున శతసహస్రములుగఁ దండ్రులననుసరించి త్రాఁగి చెడిపోవుచుండిన శిశువులు ముందు సుఖపడుదురు.”

మద్యపాన నష్టములపై యింక వ్యాసమేల. అనుభవించిన యొక్కమంగలివాని సాక్ష్యమే చాలదా ?

ఆరోగ్యము — ‘రిగ్సు’ అను వైద్యుఁ డనేకరోగములకుఁ జికిత్స సల్పినవాఁడై యిట్లు వ్రాయుచున్నాడు. ‘ఆల్కహాలు వ్యభిచారమును వృద్ధిచేయును. వ్యభిచారము అంటు జాడ్యములకు (ప్రమేహములకు) ముఖ్యకారణము. ఆల్కహాలు యోచన, శాంతి, ఆత్మనిగ్రహము, మున్నగు వాని నడఁచి రోగభీతిని గలుగజేయనందున, యనేక విషయములలో జాడ్యములకు హేతువైనది.” ఇట్టివిప్పుడు లేవని వారియభిప్రాయము.

మృత్యుదేవత మద్యపానుల వెంట నంటియుండును. ప్రకృత మమెరికాలోఁ జావులు తక్కువైనందునకు తార్కాణ

‘న్యూజెర్సీ’లో ౧౯౧౭ లో ౭౮౭౩ చావులును
౧౯౨౦ లో ౩౭౯౧ చావులును

గలిగినట్లు తెలియుచున్నది. ఇటులే తక్కిన ప్రాంతములందును లెక్కపట్టీలఁ జూచినచోఁ దెలియును.

నేరములు — మద్యముదరభాగమందుఁ జేరినంతనె యూరకుండునా? దాని సారము తలకెక్కి యందలి సందుగొందులఁదిరిగి త్రాగుబోతుల సివమెక్కిన వారినిగాఁ జేయును. ఆయవస్థయందు వారేమి చేసినను చేయఁగలరు. షేక్స్పియర్ మహాకవి ‘మేకబెత్తు’ను నాటకమును వ్రాయుతఱి కథానాయిక నరహత్య చేయఁదలఁచి తన కుశక్తి వచ్చునట్లు బాగుగా త్రాగినట్లును, ద్వారపాలకులును త్రాగి మైమఱచి నిద్రించి రాజరక్షణ కార్యమును జేయకుండుటయు బహుచమత్కారముగా వర్ణించినాడు. కావున నెందైనను మద్యపానము చేయు జనులలో నేరములు, దుష్కార్యములు, ఘోరకృత్యములు సైతము విశేషముగా సంభవించినవనిన చిత్రమేమియు లేదు. అమెరికాలో మద్యము వెడలిపోయిన నాటగోలె దాని బంధువగు నేరము గూడ సహగమనమొందెను. ఈ విషయము నుదాహరించు నీపట్టి నరయుఁడు.

బోస్టనునగరమున : త్రాగుబోతులలో నేరములు
చేసినవారి సంఖ్య.

	పురుషులు	స్త్రీలు	మొత్తము
౧౯౧౮	౫౮౪౫౭	౮౬౯౬	౧౦౭౧౭౫
౧౯౧౭	౫౨౧౨౮	౩౭౬౬	౯౨౭౩౭
౧౯౧౯	౩౯౭౮౬	౩౦౦౯	౬౯౨౧౨
౧౯౨౦	౧౭౪౬౫	౧౨౨౨	౩౬౧౪౦

మొత్తపు సంఖ్యలోఁ బూర్వము నేరము చేయువారిని నిప్పటి వారిసంఖ్యను గమనించిన నిషేధానంతరము తగ్గినటులు తెలియును. కొన్ని కారాగృహములలో నివాసు లెవ్వరు లేక పోవుటచే నయ్యవి వీధిశాలలుగను, భోజన గృహములుగను మార్పఁబడినవి.

అమెరికా విషయమై వ్రాయవలసిన యనేకాంశము లిందు పొందు పఱుపఁబడినవిగావు. గ్రంథవిస్తర భీతిచేతను, నిహాలు సింగుగారి గ్రంథమును పూర్తిగా నీభాషలో వ్రాయుట ప్రకృత వ్యాసమున కనుసరింపమిచేతను, గొన్ని నిదర్శనముల మాత్రమే యుదాహరణార్థమై గ్రహించుటయే పోలునని తలఁచి సూక్ష్మముగా వ్రాసితిని. ఈవిషయమై మన భాషలోఁ బెక్కురు చర్చించి లోకులకు సద్బోధలఁ జేయుచు మన పతిత సోదరుల నుద్ధరింతురని నాయాశయము. సదా సంపదలం దోలలాడు పాశ్చాత్యదేశము లీలోటులను బాపుకొన ప్రయత్నించుచుండ మనము దరిద్రతరంగములఁ బల్లటిల్లుచు నాగరక జాతులలోఁ దలయెత్తఁజాలక మరల మన పూర్వౌన్నత్య మొందునటుల ప్రయత్నింపక మిన్నకుండుట మహానర్థదాయకమని నమ్ముచున్నాను.

ఇంగ్లాండు మొదలగు ప్రదేశములందు మద్యపాన నిర్మూలన ప్రయత్నములు

Every Government that has touched alcohol has burnt its fingures in it lurid flame.

MR. LOYED GEORGE.

“ఆల్కహాలును ముట్టినట్టి ప్రతిప్రభుత్వమును — ఆదుష్టజ్వాలలందుఁ దనవ్రేళ్లను గాల్చుకొనినది. లాయిడ్ జార్జిగారు.”

ప్రాయికముగా లోకములో జనులకుఁ గాలముయొక్క విలువ తెలియదు. మనము విశేషకాలము వృథాలాపములందును, ప్రొద్దుపోని పనులందును కాలయాపనము చేయుచుందుము. నిముషమునకుఁ గొన్ని డాలర్లవడ్డీని సంపాదించు నమెరికా వర్తకునికిఁ గాలమువలని లాభము తెలియును. పందెములలో క్లుప్తకాలములోపల నొకపనిచేసి బహుమాన మొందఁ దలఁచినవానికి కాలమూల్యము తెలియును. యుద్ధమందు శత్రువులఁ గెలువఁదలచినవానికిఁ గాలమన్ననెట్టిదో తెలియును. యూరపుఖండమందు జనులు సాధారణముగాఁ జేతిపనులచేసి కొనుచు బ్రతుకుచుండెడివారు. యుద్ధారంభమున ప్రతినిమేషమును వ్యర్థముచేయక యుపయోగింపఁ దలఁచిరి. యుద్ధభటులు కాని, యాయుధాగారములందుఁ బనిచేయువారుకాని, త్రాగు

వారైన వారు సారాయిదుకాణములోఁ గొంతకాలము వ్యర్థము చేసి మరల నైపెక్కినపిమ్మట కాలమునే కాక కార్యమును గూడ చెడగొట్టి నానావిధకష్టములు గలుగఁజేయుట సహజము. యుద్ధారంభమున, ఏప్రెల్ ౧౯౧౫ న లాయిడ్ జార్జి గారు కాలహరణమునుగూర్చి యిట్లు పలికెను. 'ఒక నావ యుద్ధరంగమునపగిలి బాగుపఱచుటకై తేఁబడెను. కూలీలకీ పని యత్యవసరమని తెలిసియుండెను. అయితే యేమిజరిగెను. పనిముచ్చులు ౧౦౦కి ౨౩ నుండి ౩౭ వఱకు, తక్కువయగుచుండిరి. వారికి జీతమెక్కువ చేసితిమి. పైకమెక్కువ యబ్బుటచే నాలస్యమెక్కువయ్యెను. దీనికి ముఖ్యకారణము మద్యపానము." నలువదిసంవత్సర యనుభవముకలవారు, ౧౦౦-కి ౭౦ పాళ్ల కాలహరణము త్రాగుటవలననే కలిగినదని యభిప్రాయమిచ్చుచున్నారు. మదిరాపానమువలన కాలహరణమే కాక ద్రవ్యనష్టముకూడ కలుగునని లాయిడ్‌జార్జిగారు ౧౯౧౪ న "మనకు శక్తిచాలనిదేమన ౧౭ కోట్లపౌండ్ల త్రాగుడుయొక్క పట్టీ" యని నుడివెను. ఈపట్టీ ౧౯౧౭-వ సంవత్సరమున ౨౦ కోట్ల సవరణైయుండెను.

యుద్ధమందుఁ జేరిన రాష్ట్రములన్నియుఁ జేరనివి కొన్నియుఁ దమతమ ప్రదేశములందు పానాభ్యాసమును మాన్పుటకై శాసనములఁ జేసిరి. రష్యాదేశము మొట్టమొదలే సర్కారు దుకాణములు తీసివైచెను. రొమేనియా యుద్ధములో జేరినతక్షుణమే రష్యా ననుసరించెను. ఫ్రాన్సు, ఈజిప్టు, ఇటలీలో శీఘ్రముగా నీవ్యాపార మణఁచఁబడెను. బార్లీ గోధుమలు మొదలగు ధాన్యములనుండి మత్తువస్తువులు తయారుచేయఁబడుటచే జర్మనీ, ఆస్ట్రియావారు యుద్ధకాలమున భోజనపదార్థములు తక్కువయైన కష్టమువచ్చునని యోజించి యాకొఱఁతను బాపుకొనుటకై 'బియరు' సారాయిని జేయకూడదని శాసించిరి.

౧౯౧౪-సెప్టెంబర్ ౨౪ తేదిన బ్రూయర్సు గజెట్టిట్లు వ్రాసెను. "సారాయిదుకాణములను రాత్రి ౧౧ ఘంటలకే మూయుటచే లండనువీధులలో రాత్రిజరుగు చిత్రరంగములు మాఱిపోయినవి. రాత్రి ౧ ఘంటవఱకును జరుగుచుండిన తుచ్ఛగానములు, ఆటలు, కేకలు, కలహము లిప్పుడు కనఁబడవు. పోలీసులకు శ్రమ తగ్గినది."

ఇంగ్లాండులో దేశాభివృద్ధికిని, నందుముఖ్యముగా సైన్యక్షేమమునకును, చక్రవర్తి, మంత్రివర్గము, మతాచార్యులు (Bishops) మహాపురుషులు, పత్రికాధికారులు, నందఱును మత్తునుదగ్గించుటకై బహుప్రయత్నములఁ జేసిరి. అనేక పట్టణములలో నింటింటికేగి త్రాగుయభ్యాసమును బూర్తిగా విడువుడని జనులకు బోధించుచు, వారిచే వాగ్దానముల నందిరి. హిందూస్థానములోఁ జేసినరీతిని నింగ్లాండులో దుకాణములు తెఱచియుండు కాలమును దగ్గించి ధరల హెచ్చించిరి. అట్లు చేయుటచే వారికిఁ గొంతలాభము కనఁబడెను.

౧౯౧౭ డిసెంబరులో ౩,౦౬౮,౦౦౦ పౌనులు.

౧౯౧౮ జనవరిలో ౧౯౨౯౦౦౦ ,, ౩౭.౪% తగ్గుదల

౧౯౧౩ నవంబరులో ౨,౬౫౯౦౦౦ ,,

౧౯౧౪ నవంబరు ౨౨౮౮౦౦౦ ,, ౧౨.౯% తగ్గుదల

కాని కొంతకాలమునకు యథాస్థితికివచ్చెను. హిందూస్థానము లో నీమేలును గలుగలేదు. దీనికిఁ గారణములు వేరుగానున్నవిం. ఇంగ్లండు స్వతంత్రదేశము. హిందూస్థానము పరాధీనమైనది. అక్కడ యుద్ధముజరుగుచుండెను. ఇక్కడ యట్టిభయము లేదు. అచటిమంత్రు లనేకమార్గము లాలోచించి పానాభ్యాసమును దొలగించుచుండిరి. ఇచట యంతటి పట్టుదలతోఁ జేసినట్లు సూచనలు లేవు.

లాయిడ్‌జార్జిగారు రష్యా రాజ్యమంత్రితో నీ విషయమును గురించి యాలోచించుచు, పాన నిషేధమువలన వారి కేమిలాభముకలిగెనని ప్రశ్నింప 'బార్కు' అను నామంత్రి కూలిపని ౩౦ నుండి ౫౦% హెచ్చినదని చెప్పెనఁట. ఇంత కష్టముచేయువారలసటనెందినపుడు పానకాంక్షనువీడి యెట్లుండఁగలరు, అని లాయిడ్‌గారడిగినపుడు బార్కు ససంభ్రమముతో "యుండగలరు? ౭౦౦ లక్షల సవరన్లయాదాయము నాకు నష్టమైనది. నే నెట్లుండఁగలను? మరల యిప్పుడు మద్యపానమును స్థాపింపనెంచితినేని లోకులు తప్పక తిరుగుపాటు చేయుదురు" అని పలికెనఁట. లాయిడుజార్జిగారు యుద్ధమెంతశ్రద్ధతోఁ బనిచేసిరో యదేరీతి మద్యపానముతో నంత

యుద్ధముచేసిరి. సారాయిపై పన్ను హెచ్చించినకాని దానిఁ ద్రాగుట తగ్గదనితలఁచి యట్లుచేయఁ దీర్మానించినపు డింగ్లీషు ప్రజలు దాని నిరాకరించిరి. ఆస్టిన్ చేంబర్లేను "ఇది క్రూరమైనది. నాశనకరమైనది" అని యభిప్రాయపడెను. హీలీయనువారంతకన్న కఠోరముగా నిది మనుష్యులఁ జంపుపన్నని సెలవిచ్చిరి. ఇటులే వర్తకులందఱును దిరుగుబాటుచేయ, ౧౯౧౮ మే ౭ న, 'పన్నులహెచ్చించుట మానినారము' అని నివేదింపఁబడెను. స్వతంత్రదేశమందు జనుల యభిప్రాయము లెంత ప్రబలమైనవో కనుఁడు. హిందూస్థానములో రౌలట్టుచట్టమెట్లు ప్రజాభిప్రాయముల దిరస్కరించి శాసింపఁబడెనో యాలోచింపుఁడు.

ఆదేశమున యుద్ధారంభమందొకొక్కవీధిలో నర్థమైలు లోపలనే ౩౦ దుకాణములుండుటచే ప్రభుత్వమువారు వీనినిఁ దమయాధీనమందుంచిననేగాని దేశమునకు మేలుగలుగదని తలఁచిరి. లార్డులాండ్సుడౌన్ ఈచట్టముపై తనయభిప్రాయమిట్లిచ్చెను. "ఈ స్వాధీనశాసనము (State Control Bill) మేలు చేయుననితలంచెద. ఈచట్టము శక్తిచాలనివానిని ప్రబలునిగాఁ జేయకపోయినను వానిమార్గమున మనస్సు నాకర్షించునది లేకపోవుటయే ముఖ్యలాభము."

"మద్యమునకుమారుగా వేరు రుచిపదార్థముల జనులకిచ్చుటచే మద్యపానము నశించును." మే ౧౯౧౯ నాడిది చట్టమయ్యెను.

ప్రభుత్వాధీనమైనపిమ్మట దేశస్థితి బహువిధముల మారుచువచ్చెను. వాల్టర్ లాంగు ౧౯౧౬ సంవత్సరమున జూలైలో "దరిద్రుల సంఖ్యయెన్నఁడు నింత తక్కువగ నుండలేదు. కూలినాలిచేయని మనుజుఁడేలేఁడ"ని చెప్పెను. ౧౯౧౬ సంవత్సరములోఁ ద్రాగుటవలని నేరములకై ౧౩౬ త్రాఁగుబోతులనుగుఱించి ఆబర్నాక్ ఇట్లు తెలుపుచున్నాఁడు.

౧౩౬ లో ౯౫ గురు పురుషులు. ౪౧ రు స్త్రీలు.
ఇందులో ౪౯ గురు విందులలోఁ ద్రాగినవారు. ౨౧ రు ,,
౧౪ గురు రోగము లేక వ్యసనము, వీని పరిహారార్థము త్రాగినవారు.
౩ గురు భోజనములేకయేత్రాగిరి.
౨౯ గురు ఇతర కారణములచేత. ౧౩ రు ,,

ఇట్లు త్రాగువారు మతిభ్రష్టులై చెడిపోవుచుండిరి. ౧౯౧౫ సంవత్సరమున నొకనాఁ డొకఘంటలోపల ౬౪ దుకాణములలో ౧౫౯౩౩ మంది త్రాగుటకుఁ బ్రవేశించినటుల లెక్కింపఁబడిరి. అందు ౬౩౨౯ గురు స్త్రీలు.

ఇంగ్లాండులోఁ బానమును నిరోధించుటకై ప్రత్యేక సంఘము నొకదానిని ప్రభుత్వ మేర్పాటుచేసి దానిద్వారా యనేకచట్టముల చేసెను. వానిలో ముఖ్యముగా బోర్డువారికీయధికారముల నిచ్చిరి.

౧. లైసన్సుకల దుకాణముల నెప్పుడైనను మూయవచ్చును.
౨. విక్రయించుకాలము నిష్టమువచ్చిన ట్లేర్పాటుచేయవచ్చును.
౩. చిల్లర యమ్మకముల నిలిపివేయవచ్చును.

౪. చిల్లర యమ్మకముపై కొన్ని 'షరతుల' నేర్పాటు చేయవచ్చును.
౫. నిర్దిష్టప్రదేశములోనికి మత్తువస్తువుల రానిచ్చుట తమవశము.
౬. ఆల్కహోలును సారాయిలో నెంత కలుపవలసినది వీరు నిశ్చయింపవచ్చును.

ఇంతియకాక వీరికీ క్రిందిహక్కులుకూడ కలవు.

౧. బోర్డువారు సారాయిని మొత్తముగా వారేయమ్మవచ్చును.
౨. రుచిపదార్థముల నమ్ముట కేర్పాటుచేయవచ్చును.
౩. విందులనుజేయకూడదని యుత్తరు వొసంగవచ్చును.
౪. సారాయి నమ్మువాఁ డెటువంటిసారాయి నమ్మినది అందెంత ఆల్కహాలుండినది; దానిధరను, త్రాగిన వానిపేరును, వ్రాయుచుండవలయుననియు నుత్తరువునిచ్చుటకు వీరి కధికారమియ్యఁబడెను.

ప్రభుత్వస్వాధీనమువలన ఫలములు.

తత్ఫలము నీక్రిందివిషయములవలన తెలియును. (౧) నేరములు. (౨) మృత్యువుల సంఖ్య. (౩) బాలురచావులు. (౪) ఆత్మహత్యలు. (ఇవన్నియుఁ దగ్గినటుల తెలియును) (౫) బియరు మొదలగువాని మొత్తము.

(౧) నేరములు. ౧౯౧౩ సంవత్సరమున ౧౦౦ %
,, ౧౯౧౫ ,, ౨౪ % తక్కువ.
,, ౧౬౧౬ ,, ౫౬ % ,,
,, ౧౯౧౭ ,, ౬౬ % ,,

త్రాగుబోతులలో శిక్షితులు తక్కువయైనట్లు చూపుసంఖ్య:—

పురుషులు

౧౯౧౩ లో	౧౯౧౪	౧౯౧౫	౧౯౧౬	౧౯౧౭
౨౮౧౦	౨౬౮౮	౧౮౯౩	౧౧౪౮	౮౫౨

స్త్రీలు

౬౭౨	౭౧౦	౬౨౪	౩౯౬	౩౨౩

ఈ లెక్కలంబరికించిన నపరాధములు సేయువారు తగ్గిరని విశదమగును.

(౨) ఆరోగ్యము—ఆల్కహోలువలన చచ్చుచుండినవారు:—

పురుషులు.

౧౯౧౩	౧౯౧౪	౧౫	౧౬
౧౧౧౨	౧౧౩౬	౮౬౭	౬౨౦

స్త్రీలు.

౭౧౬	౬౮౦	౫౮౪	౩౩౩

ఈ విషయమందుకూడఁ మరణించువారు తక్కువయను సంగతినిజూడ యారోగ్యవంతులు విశేషమగుచున్నారని తెలియును.

లివరు (కార్జము) జాడ్యములవలన చచ్చినవారు.

౧౯౧౪	౧౯౧౬
౫౦౩౬ (స్త్రీ పురుషులును)	౨౯౮౬

(3) స్త్రీలు విశేషముగాఁ ద్రావుటచే బిండములకు హాని గలిగిన సంఖ్య. (Overlaying of infants.)

౧౯౧౩	౧౨౨౬
౧౯౧౪	౧౨౩౩
౧౯౧౫	౧౦౨౧
౧౯౧౬	౭౪౪

(౪) ఆత్మహత్యలు సేసికొన సిద్ధమైనవారి సంఖ్యలు:—

౧౯౧౩ (స్త్రీ పురుషులు)	౧౪	౧౫	౧౬
౨౪౨౬	౨౪౧౫	౧౬౦౮	౯౪౫

(౫) సురాపానముకూడ తగ్గినందుకుఁ దార్కాణము.

౧౯౧౫-౧౬ లో ౩౫,౫౯౭,౦౦౦ గ్యాలన్ల సారాయి ఖర్చయ్యెను.

౧౯౧౬-౧౭ లో ౨౪౦౦౬౦౦౦ గ్యాలన్లు

దీనిచే నొకసంవత్సరకాలము లోపలనే మూడవవంతు తఱిగెనని బోధపడుచున్నది. ఇట్లు ఇంగ్లాండులో మద్యపానము యుద్ధకాలమున చాలవఱకు తగ్గియుండెను.

ఈయంశము ప్రభుత్వబలముచేతమాత్రమే తగ్గిపోయెనని చెప్పుటతప్పు. ఇంగ్లీషుజాతి స్వాతంత్ర్యాపేక్షకలది. ఇష్టమునకుఁ దగనిదైనవారు కలహించియైనను తమకోరికలను నెరవేర్చుకొనువారు. (౧) కావున ప్రథమమున నింగ్లీషు ప్రజలు దేశాభిమానులై దేశక్షేమమునుగోరి యాత్మనిగ్రహము గలిగియుండి ప్రభుత్వమునకు సహాయమొనర్చిరి. (౨) వీరికిఁ దోడుగా సైనిక నావికానిర్బంధములు, సేనయందలి భటులును, నావలందలి నావికులును త్రాగిన తమపని చేయకుండుటయే కాక యత్యంతావసర సమయములందుఁ గార్యధ్వంసము చేయుదురను భయముతో నాజనుల నాయకులు, నధికారులందఱుకలసి కఠినశాసనములఁజేసి దేశహితమును గావించిరి. (3) సారాయి దుకాణములకుమారుగా మిఠాయి, టీ, కాఫీ,

మొదలగు సత్పదార్థములనమ్ముచు, త్రాగువారి మనస్సుల ద్రిప్పఁ బ్రయత్నించుటకూడ చాల సహాయమొనర్చెను. (౪) సారాయి మొత్తమునే తగ్గించుట నాలవకారణము. హిందూస్థానమందువలె దుకాణముల తగ్గించి సారాయి మొత్తము నెచ్చించుటకాదు. అసలు వస్తువునే క్రమక్రమముగాఁ దగ్గించుట ముఖ్యముగా గమనింపఁదగినది.

ఇంగ్లాండువారు యుద్ధావసరమున బహువిధప్రయత్నములఁ జేసిరికాని అమెరికావారివలె సర్వకాలమునకై నిలుపుటకుఁ బ్రయత్నింపలేదు. యుద్ధమందు జయమందినతోడనే సారాయిత్రాగుట యథాప్రకారమైనటుల కనఁబడుచున్నది. అయినను అమెరికా క్రొత్తబాటను జూపించినందునను, పుస్సీఫుట్టు జాన్సన్ ఇంగ్లాండులోనే స్థానమేర్పఱచుకొని నిరంతర పరిశ్రమ చేయుటచేతను, ప్రభుత్వమువారుకూడ యీ యుద్యమమున కడ్డకాలు వేయకుండుటచేతను, గొందఱి యభిప్రాయ ప్రకారము ౧౯౩౦ సంవత్సరము లోపలనే యింగ్లాండు మద్యపాన నిషేధమును బూర్తిగా బూనవచ్చును.

మద్యపాన సమస్య

శ్లో॥ "భిక్షో మాంస నిషేవణం కిముచితం ?" "కిం తేనమద్యంవినా ?"
"మద్యంచాపి తవప్రియం ?" "ప్రియమహో వారాంగనాభిస్సహ !"
"వారస్త్రీరతయే కుత స్తవధనం" "ద్యూతేనచౌర్యేణ వా !"
"చౌర్యద్యూతపరిశ్రమోస్తి భవతః" "భ్రష్టస్య కావాగతిః !"

పూర్వకాలమందు కాళిదాసుఁడు భిక్షుకవేషమున భోజరాజుతో నైవిధమున సంవాదముచేసెనని లోకప్రతీతికలదు. ఏదియెట్లున్నను, శ్లోకమెవ్వరిదైనను దాననుండిన యర్థముచాల గంభీరమై యనేకవిషయముల వెల్లడించును. భోజుఁడు "ఓరీ! భిక్షుకా! మాంసము మెసవుట సీకుచితమా?" యన భిక్షుకుఁడు "దాని వెంబడి కల్లుండినకదా దానిరుచి" యని వాక్రుచ్చెను. మరల భోజుఁడు "కల్లుకూడ నీ కలవాటా?" యని మందలించిన భిక్షుకుఁడు 'ఆరెంటివెంట భోగపుసానులుండిన నాసౌఖ్యమెంతటిదో కనుఁడని' బదులుచెప్పెను. భోజుఁడంత "ఓరీ! వెలవెలఁదులకు ధనమెచ్చటనుండి తేఁగలవు" అని ప్రశ్నింపఁగా భిక్షుకుఁడు నెమ్మదిగా "జూదమాడియైన లేక దొంగలించికొని తెచ్చెదను" అనిపల్కెను. రాజత్యాశ్చర్యమున నిట్లను "చౌర్యద్యూతములందు సహితము తమరికి పరిశ్రమకలదా ?" భిక్షుకుఁడు "భష్టునికిం కేమిమార్గముకలద"ని యనెనఁట. దీనివల్లన

…విషయములు స్ఫురించును. కల్లు సారాయి మొదలగువానిఁ ద్రావుటచే మాంసభక్షణము, వ్యభిచారము, దొంగతనము, జూదము, తుదకుభ్రష్టగుటయు సంభవించును.

ముందు ప్రకరణములందు మద్యాదులవలని నష్టముల గుఱించి యచ్చటచ్చట చర్చించియుంటిని. ఇందు మనహిందూస్థానమునకు సంబంధించిన మఱికొన్ని విషయములఁ దెల్పెద.

కల్లు మొదలగు మత్తువస్తువులు ద్రావువారు ధనమానప్రాణనష్టములకుఁ బాలగుటయేకాక తమపై నాశ్రయించువారిని బలుసిలుగులకుఁ బాలుసేయుదురు. ఈయభ్యాస మెట్లు పట్టువడునో యని యనేకు లూహింపవచ్చును. దీనికి సహవాసదోషమే ముఖ్యకారణము. ఇయ్యదితప్ప వేరుకారణమిప్రపంచమందుఁ గానబడదు. కల్లుద్రావనివారు కొంత యూహించినఁ దెలియును. విద్యార్థులొండె వ్యాపారులొండె తాము చుట్టలను ద్రావువారితో నెల్లప్పుడును గలసియుండుటచే నొకనాఁడు తాము 'తమాషా'కు చుట్టనుగాల్చి ధూమము విడుచుదురు. దీనినిగని స్నేహితులు దినదిన ముత్సాహముతోఁ జుట్టలనం దిచ్చుచుందురు. కొంతకాలమున కిది యభ్యాసమై పోవును. ఇట్లే నస్యము, కాఫీ, భంగీ మొదలగునవి. కావుననే పెద్దలు శాస్త్రములలో దురభ్యాసములుగల వారితోఁ గూడిన వాఁడును మహాపాతకియనిరి. ఈయలవాటునకు రెండవకారణముకూడ కలదు. కొందఱు కడుపునొప్పులతో బాధపడు

నప్పుడైన మూర్ఖులగు వారి బోధలచేఁ గల్లు మొదలగు వాని యలవాటుచేసిన పోవునని తలఁచి ప్రారంభము చేయుదురు. కొన్ని లేక యనేకవిషయములలో నీచికిత్స మేలును గలుగఁ జేయఁవచ్చును. కాని యివితప్ప వేరుమందులు లేవాయని ముందు యోజింపవలదా? "ముల్లుపుచ్చి కొఱ్ఱుడిచిన చందము" కాదా!

త్రాగుబోతుల యవస్థలకు సాక్షియైన "గాడరు" యను నతఁడు ఏప్రల్ ౧౪-వ తేది. (౧౯-౨౧) నాఁడిట్లు వ్రాసెను. "జరిగిన యథార్థములనే నప్పుడప్పుడు చూచినది నా'డైరీ'లో నిట్లు వ్రాసినాడ.

౧౫-౧౦-౨౦. తేదిన—నీలగిరికిఁ గొన్ని మైళ్ల దూరముననున్న యొక్క పల్లెటూరివాఁడు కైపెక్కి. కొలంబో సారాయి యనుకొని యూక్లిప్టస్ నూనెబుడ్డిని బూర్తిగాఁ ద్రావెను. ఇంటికిఁ బోవునపుడు మార్గములో నాకస్మికముగా మృతినొందెను.

"౨౫-౧౦-౨౦. తేదిన—ఇద్దఱుటోడులు, ఒక్క స్త్రీయును, మిక్కుటముగాఁ ద్రావి శరీరముపైనున్న వలువల విసర్జించిరి. ప్రక్కనున్న వారెంత ప్రయత్నముతో నుడుపుల సవరించినను వారర్ధనగ్నాంగులై వీధిలో నడచుచుఁ బోయిరి.

"౯-౧౦-౨౦. తేదిన—ఒక చిన్నది కాన్పుకాఁగా బ్రాండీ మిక్కుటముగ నిచ్చుటచేఁ జావసిద్ధమయ్యెను.

"౨౬-౧౧-౨౦. తేదిన—౧౬ ఏండ్ల బాలుఁడొకఁడు ప్రత్తిశాలలోఁ బనిచేయుచు సారాయి త్రాగుచుండెను.

ఆంగ్లవైద్యునిమందు తీసుకొన్నను బ్రతుకలేదు. వాఁడు తన తల్లిని ముగ్గురక్కసెలియండ్రను సాకుచుండెను. ఇప్పుడు వారు నిస్సహాయులై యున్నవారు.

"నెలకు ౪౦ రూకల సంపాదించు గుమాస్తాయొకఁడు త్రాగుటయందు ౩౦౦౦ రూకల గోలుపోయెను. ఇటీవల వాని యజమాని వానిని జాలఁ ద్రాగినందులకు వెడలఁగొట్టెను.

"తిరుచనాపల్లి వడ్డెవాఁడు దినము ౩ రూపాయలు సంపాదించుచుండెను. వాని యిల్లాలు చచ్చినవెంటనే తన ధనమును ద్రాగుటయందు ఖర్చుపెట్టి తన బిడ్డల నిలువెడల నడిపెను."

వీరు తెలిపిన విషయములలోఁ జిత్రమేమియు లేదు. అనుదినము మనము ప్రతిగ్రామమందును బట్టణమందు నిట్టి విపరీతములఁ జూచుచునే యుందుము. కల్లు దుకాణములలో గొంతు కూరుచుండి నాల్గవముంతనో యైదవముంతనో పీల్చుచుఁ బ్రేలుచు నార్భాటముసేయుచు నంతటితోఁ దనివిసెందక బయటకు వచ్చినతోడనే తమ యుల్లాసమును వెల్లడింపఁ దల్లడింతురో యన్నట్లు రెండుచెక్కలను విదిర్చుచు, బిరుదునాట్యములు సేయుచు నోటికివచ్చిన పదములఁ బాడుచు, సొరుగుచుఁ, దుదకొక కాలువయందో, యేనూతియందో పడు మతిహీనులఁ జూచుచుందుము.

ఇట్టి త్రాగుడువలన సర్వవిధముల నష్టములు గలుగును. మొట్టమొదటచే జిడ్డువదలి కొలదికాలములో ద్రవ్యము వ్యయ

మై యశము నాశనమై గౌరవమునకు దూరులగుదురు. రెండవది ప్రాణహానియగును. మూడవది తమయార్జనముపై నాశ్రయించు కుటుంబమువారు నిరాశ్రయులై యుందురు. ఇంతియ కాక త్రాగువారి సంసారమెల్లప్పుడును గలహములతో నిండి యుండును. భార్యాభర్త లిద్దఱును నాసవపానోత్సుకులై యుండినవారి జీవనమును వర్ణింప నేరితరము ?

మనదేశము ప్రపంచమంతటను మిగుల దరిద్రస్థానమై యున్నది. "హారోల్డుమాను" మొదలగువారి యాధారముల సూచించియుంటిని. ఇట్టి తారతమ్యములుకల మనదేశము వృద్ధిగాంచవలయునేనిఁ దప్పక మనదుర్వృత్తుల మానుకొనవలయును. మనదేశములోఁ గూలినాలిచేసి బ్రదుకు నట్టి జనులు విశేషముగా ద్రావుచుందురు. ఇంతియకాక యనేక గృహములలో మగవారే కుటుంబ సంరక్షణమును జేయువాడుక.

ఉదాహరణార్థమొక యింటిలో నొక ముదుసలియు, భార్యాభర్తలు, వారి ముగ్గురుపిల్లలుందురని యూహించెదము. మాన్ (Mann) గారును జర్చించిన గ్రామములందుఁ దఱచుగా నాలుగురుండిన గృహములే విశేషముగానున్నవని తెలియుచున్నది. ఈయాలుగురిలో భార్యాభర్తలు కూలిపలనవచ్చు పైకముతోఁ ముదుసలిని బాలురను బోషించెడివారు. వీరిరువురొకరూకను దినమునకు సంపాదింతురు. వీరు కనీసముఁగా

అణాలు త్రాపుటలో వ్యయపఱచిన దక్కినదానితో రెండు పూటలాఱుగురు భుజించుటెట్లు. పైనపండుగలో, రోగములో వివాహములో, శ్రాద్ధములో, తటస్థించినపుడేమి చేయుదురు. వీనికంతయును ద్రవ్యమువలదా? ఈకుటుంబమే త్రావకుండిన నొకరీతి కాలముగడపి సత్ప్రవర్తనముచేఁ బెద్దల సంతోషపెట్టి ముప్పువాటిల్లినపుడు వారిసాయము నందుదురు.

డాక్టరు జాన్సనుగారు హిందూస్థానములో నుపన్యసించునపుడెల్లను మద్యపానము దుష్టాభ్యాసములలో మిక్కిలి నీచమైనదని యనేకవిధముల సభ్యులకు బోధచేయుచు వచ్చెను. మద్రాసులో నుపన్యసించునపుడీ క్రిందివిషయము నుదాహరించెను. అతఁడు రెడ్డిండియను జాతులలోఁ బనిచేయునప్పుడా జాతివారీ దురభ్యాసముచే దినదినము సంఖ్యలలోఁ దగ్గిపోవుచుండిరఁట. అందు 'ఫర్ఫెక్టోసిగాంటో' యను వాఁడు సహజముగా సజ్జనుఁడై యుండెను. కాని త్రాపుటయందు మితిమీరుటచేఁ జెడిపోవుచుండెను. ఈలోపమును మాన్పుకొనఁగోరి యతఁడు ౨౦ మైళ్లి దూరమందున్న పట్టణములో నిషేధక చట్టము చెల్లియుంట నానగరమున నివాసము చేయఁదొడఁగెను. ఒకనాఁడు ప్రక్కపల్లెయందొక స్నేహితునిఁ జూడఁబోయి వాని సహవాసమునకై పెక్కునట్లు కుత్తుకబంటిగాఁ ద్రావి గృహాభిముఖుఁడయ్యెను. ఇంటి తెఱవ పాపమనేకవిధముల నతని బతిమాలినను వినక యామెను జావఁగొట్టుచుఁ

ప్రమాదవశమునఁ దన చిన్ని బాలుని తలఁ బగులఁగొట్టెను. కొంతసేపటికిఁ దెలివిగలిగినవాఁడై, భీతిచెంది, న్యాయాధికారి చెంగటకేగి తన నేరమునుజాటుచు, శిక్షింపుమని వేడుకొనెను. న్యాయాధికారి వానిని యావజ్జీవమునకుఁ గారాగృహమందుండునటుల శిక్షించెను. ప్రకృతము వాఁడు కాలిఫోర్నియా జైలులోఁ గష్టించుచున్నాఁడు. ఈసంగతిని నివేదించుచు జాన్సనిట్లు గర్జించెను. "ఈ విషయములెట్లు సంభవించును? సారాయి నమ్ము గ్రామము కొంత దుష్టద్రవ్యమును (Dirty money) గడించుటకును, సర్కారువారు కొంత క్రూరపుఁ బన్నును (Bloody Revenue) సంపాదింప సమకట్టినందులకీ కీడులు సంభవించుచున్నవి?"

దేశీయులార! మనదేశమందనేక గృహములు, వైద్యశాలలు, అంధులకు, బధిరులకు, నున్మాదులకును స్థాపింపఁబడియున్నవికదా! పిచ్చియెత్తునట్లు త్రావువారికే నిర్బంధములు కలవు? మతిదప్పినవానిని మనము సంరక్షింపవలయునా? లేక స్వకీయప్రాణమునకు, భార్యాపుత్రాదుల ప్రాణములకు హానియవునట్లు వానిని విచ్చలవిడిగా సంచరించునట్లు చేయవలయునా? జాన్సనుగారొకతూరి యిట్లుపన్యసించిరి. "నాగరికతనొందినటులఁ దలఁచు ప్రతి ప్రభుత్వమును నీలోపమును బాపుకొనవలయును."

"౪౦౦౦ సంవత్సరములనుండి లోకములో బానిసలవ్యాపారముండినది. బానిసత్వమువలన బానిసలకేమియు లాభ

ముండ లేదు. బానిసల నమ్మువారికిని, వారి సేవలందు వారికిని లాభములు గలుగుచుండెను. గతశతాబ్దమున లోకమందలి రాష్ట్రములలోఁ గొంత న్యాయవిచక్షణ వృద్ధినొందిన తఱి యీ బానిసత్వము నిర్మూలింపఁబడెను. ఈ శతాబ్దమందు మద్యపానమునకు బానిసలైన వారిని స్వేచ్ఛులనుగాఁ జేయ లోకమందుఁ బ్రయత్నములు జరుగుచున్నవి. నాదేశము (అమెరికా) పాశ్చాత్యప్రపంచమున నీదురభ్యాస నిర్మూలనమును జేయుటయందు ప్రప్రథమమైనదని నేనుబ్బి పోవుచున్నాను. మఱియు పాశ్చాత్య దేశములన్నియు నమెరికా నాయకత్వమున నీఘోర సర్పమును నడఁచి వేయుచున్నారు. మేమచ్చట ప్రయత్నించిన రీతి హిందూస్థాన మీ ప్రాక్ప్రపంచమున నాయకత్వమును వహించునని యాశించుచున్నాము. హిందూస్థానజనులకిదియే నాసందేశము”

హిందూస్థానమెంత పరాధీనమైనను, నీతితత్త్వములఁ బ్రపంచమునకు బోధింపఁదగినదని పాశ్చాత్యులే కాక మనము గర్వించుచుంటిమి. ఆహా! నేటికి నమెరికానుండి వచ్చిన జాన్సనుగారు మనకు మనశాస్త్రముల విప్పి చూపింపవలసి వచ్చెనుగదా! భారతీయులార! లెండు! ప్రబోధమును గాంచుఁడు. మీ భారతమాతయొక్క పూర్వమహిమను గొంత భావింపుఁడు. లోపములఁ బాపుకొనుఁడు. తపస్యము నాచరింపుఁడు. మరల లోకమందు మీగౌరవ స్థానమునందుఁడు.

మద్యపాన నిర్మూలనోపాయములు

“మనదేశమున విద్య నభివృద్ధిసేయవలయుననిన మనుజులెక్కువగాఁ ద్రావుట నభ్యసింపవలయును.”

(లోకమాన్యతిలక.)

మద్రాసులోఁ గొంతకాలముక్రిందట యొక యుద్యోగు డిట్లుపన్యసించెనని తెలియుచున్నది. “సర్కారునకు వచ్చునాదాయపుశాఖలలో నాబ్కారీపన్ను మూఁడవది. ఈ పన్ను నిలిచిపోయిన రాజ్యాంగపాలనము సేయుట దుస్సాధ్యము.”

(Reforms) నూతనరాజకీయసంస్కారము మాంటేగ్యూ చెమ్సుఫర్డులచే సంహితమై హిందూస్థానమునకు సమర్పింపఁబడినవి. ఈసంస్కారములు ముఖ్యముగా రెండుశాఖలుగ విభజింపఁబడినవి. (౧) “రిజర్వుడు”—వీనియందు శాసనసభలకు మిక్కిలి హక్కులేదు. (౨) “ట్రాన్సుఫర్డ్”—వీనియందు సభలకు హక్కుఁగలదు. ఈరెండవశాఖయందు విద్య, మునిసిపాలిటీలు, ఆబ్కారీ, అడవులు మొదలగు చిల్లరసామగ్రియుఁ జేర్పఁబడినవి. ఈరెంటిపై మూఁడవహక్కొకటికలదు. రెండవశాఖపై ప్రజలకెంత స్వాతంత్ర్యమిచ్చినను సర్కారు

నకు సరిపడకపోయిన సభ్యులతీర్మానమును గొట్టివేయవచ్చును. మొన్న నే మోచెర్ల రామచంద్రరావుగారు మద్యపాననిషేధమునుగూర్చి ప్రశ్నింపఁబోయిరి; కాని రాజప్రతినిధి సెలవు కావలయునని సర్కారుపక్షమువారు నుడివిరి. ఇప్పుడు ఆబ్కారీ సారాయి మొదలగువానిని దీసివైచిన దేశీయవిద్యకై యెచ్చటి నుండి పైకము తేవలయునని ప్రశ్నించుచున్నారు.

జాన్సను దీనికిఁ బ్రత్యుత్తర మిట్లు చెప్పియున్నాడు. అమెరికాలో నిదేవిధముగాఁ బన్ను తగ్గునని యనుమానము కలిగెను. కాని నిషేధము ప్రారంభమైనపిమ్మట సర్కారున కీపన్ను దగ్గిపోయిన నితరవిషయములలో ఖర్చులుసహితము తగ్గిపోవుటచేఁ గష్టము గనఁబడలేదు. జైలుఖర్చులు, నేరములఁ దీర్మానించు కోర్టులవ్యయము, పోలీసుల కిచ్చుద్రవ్యము, మున్నగునవి తగ్గిపోయెను. ఇంతియకాక జనులు బూర్వవిధమున ధనము వ్యర్థము సేయక గడించుచుండుటచే ధనికులై నూతన గృహములను, మొదలగునవి నిర్మించుటచేతను, నాదాయపుఁ బన్ను విశేషమగుటచేతను ప్రభుత్వమునకు ధనము గూడుచున్నది. ఇందుకొక యుదాహరణము. అమెరికాలో నొక కంపెనీవెల ఆబ్కారీకాలమున ౧౮,౬౬౦ డాలర్లు. నేడు దాని ధర ౬౫,౦౦౦ డాలర్లు. ఇదేవిధముగ బ్యాంకులలో ధనము గూడుచుండుటచేత నాదాయపుఁబన్ను విశేషముగా నబ్బుచున్నది.

హిందూస్థానములో నీసమస్యను బరిశీలింప వచ్చునుగదా. మఱియు సర్కారువారు విద్యకెంత ధనమును వ్యయపఱచుచురో దానికన్న సుమారు పదిరెట్ల ధనమును సైన్యమునకై వ్యయము చేయుచున్నారు. కావున సైన్యవ్యయమును దగ్గించి విద్యాధనమును బలపఱచినమేలు. సైన్యమును దగ్గించిన దేశక్షేమము రక్షింపఁబడదని ప్రశ్నింతురేమొ. ఆఫ్ఘను భయమును బాపుటకై హిమాలయ సరిహద్దుల సైన్యమునుంచి మిక్కుటముగా గాపాడుచుందురు. ప్రకృతము ఆఫ్ఘను చక్రవర్తి మన ప్రభుత్వమునకు స్నేహితుఁడై (Ally) యున్నాడు. కావున సైన్యావసరమంతగానుండదు. మఱియు, ప్రజాసైన్యము (Citizen army)ను విశేషముగా వృద్ధిపఱచిన యన్యదేశము నుండి దాడివచ్చిన మనశత్రువులను మనము మన ప్రభుత్వసహాయమున, మన దోర్బలమున, సంఖ్యాబలమునను బాఱఁదోలఁజాలమా? ఇంతియకాక ప్రజల కాయుధములఁ బట్టనేర్పిన శత్రువులీ సామ్రాజ్యముపై యెట్లు రాఁగలరు? ఈవిషయమై కొంతకాలమునకు మున్ను హిందూస్థాన సేనానాయకుఁడు మనము కత్తిపట్ట నేర్చుటకు ౨౫ సంవత్సరములింకను గావలయునని సెలవిచ్చెను. ఏమీ? ౧౫౦ సంవత్సరములనుండి మనలఁ బాలించియు నింకను మనము దేశసంరక్షణా సమర్థులమై యుండవలయునా? ఈవిషయమును దేశీయనాయకులును బ్రజలును నాలోచించి తీర్మానింపవలయునని తలచుచున్నాను.

మద్యపానమును నిషేధింపవలయునని తలఁచిన యనేకాక్షేపణములు కలుగుచున్నవి.

౧. ఇందు ముఖ్యమైనది సర్కారు ఆదాయము తగ్గుట. దీనివిషయమై పైనకొంత చర్చించితిని. అంతకన్న విశేషము నేఁ జెప్పఁజాలను. ప్రకృతమందు శాసనసభ్యులుగా నుండువారీ విషయమును సమగ్రముగాఁ బరిశీలింపవలయును.

౨. ఈడిగెవారు, సారాయి మున్నగువాని నమ్మువారీ వ్యాపారము నుడిగిన జీవనాధారము లేకపోవునని కొందఱాక్షేపింతురు. దేశహితమునకై ప్రాణముల సహితమిచ్చుటకు సంసిద్ధులైనవారీ భూమియందే కాదు. ఇటలీ, ఐర్లాండు, ఈజిప్టు, ఇంగ్లండు, మున్నగు దేశములందును లెక్కఁకు మించిన వారనేకులుండిరి; యున్నారు; యుండుట సహజము! కావున ఈడిగెమొదలైన జాతులీవృత్తిని వదలుటచే రవ్వంతయైనను గోలుపోవువారు కారు. లోకమందెన్ని వ్యాపారములు లేవు. ఒకదానియందు లాభములేకున్న నింకొకవ్యాపారము సేయవచ్చునుగదా? ఈడిగవారందఱు, నమెరికాలో మద్యవ్యాపారులేమిచేసిరో కొంత తెలుసుకొనవలయును. వారు వేరువ్యాపారములుచేయుచు సుఖముగ నున్నవారు.

౩. మఱియు మూఁడవయాక్షేపణ మొకటికలదు. 'మద్యపానుల మనస్సుల మార్పఁగలమా?' యను ప్రశ్నను చర్చింపవలయును. ప్రపంచమందు దుష్కార్యములకును, సన్మార్గము

లకును మనమే ప్రధానము. ఈ మనసునుండియే కామాదు లుద్భవించి కార్యానుచరణమును బురికొల్పును. ఒకవస్తువును జూచిన దానిపై యాలోచనఁ జేయును. దగ్గఱయుండిన దాని నభిలషించును. సులభసాధ్యమైన తత్క్షణమే ప్రయత్నించి యభీష్టమును దీర్చుకొనును. కావున గావలసినవస్తువు సన్నిధియందు లేకుండిన మనస్సు దానినెంతకోరిన నది లభింపదు. ఈమద్యమును నిషేధించిన ద్రావువారు కొంతకాలము కష్టపడి యలవాటు తప్పినపిదప యూరకుందురు. ఇందులకు జాన్సను గారొక మంచి యుపమానమును జూపించినాఁడు. 'దోమలవలన మలేరియాజ్వరములు వృద్ధియగును. కావున వీనిని నిర్మూలింపవలయుననిన, దోమల జంపుటవలన, పరదాల కట్టుకొనుటవలన, శరీరమునకు నూనెరాచుకొని పండుకొనుటవలన, దోమలు తగ్గవు. దోమలెచ్చట వృద్ధియగునో, యేజలములందు విశేషముగా నుండునో వానిని గమనించి, యాస్థలముల నెండించి శుభ్రపఱచిన పోవును. అటులే అమెరికాలో మద్యపాన దురభ్యాసము దుకాణములుండువఱ కెన్నడును నశించినది కాదు. జనులు త్రావుట కూడదని తీర్మానించి పట్టుపెట్టుకొనిరి. దుకాణములకుఁ బోఁగూడదనియు నిశ్చయించుకొనిరి. కాని యీయవస్థల వలన మేలుకలుగలేదు. ఈ యభ్యాసమునకు మూలమైన యంగళ్లను మూసిననేగాని యాబాధ తగ్గక పోయెను."

౪. నాల్గవ యాక్షేపణ—ఆల్కహోలు మొదలగునవి వైద్యులచే వాడఁబడుచున్నవి. కొన్నిరోగముల కౌషధము నిచ్చునపు డీద్రవ్యములు చేరవలసి వచ్చునుకదా! అప్పుడెట్లు? అనిన అమెరికాలో ౧౦౦౦౦ డాక్టర్ల యభిప్రాయమును గనుడు. "ఆల్కహోలు ఆరోగ్య హానికరమైనది. ఔషధములలో నుపయోగింపఁగూడదు." ఇంక ననుమానింప నవసరము లేదు. ఒకవేళ యవసరమేమైనచో నిషేధమువలన వైద్యులకేమియుః నాటంకముండదు. వారౌషధములందు వాడినను లోకుల కందఱకేమియు హానికలుగదు కదా !

౫. కష్టముచేసి బ్రదుకువారు దివసాంతమున మద్యమును బుచ్చుకొనిన శాంతినొంది సుఖపడుదురని కొందఱి సిద్ధాంతము. ఈవిషయము నింగ్లాండులో యుద్ధావసరసమయంబునఁ బరిశీలించి చూచినపుడు త్రాఁగినవారు చాలఁ బరిశ్రమను జేయఁజాలరనియు, త్రావకుండినవారు విశేషముగా శ్రద్ధాళులై పనిచేయుదురనియుఁ దేలెను. త్రావినపుడు కొంత శ్రమనివారణమైనట్లు కనుపించును. కాని మరల కొంతవడికి వారి కాయాసము విశేషమగును. కావున కష్టముచేయువారికి నూతకత్తి విరిగిపోవును గదా యని పశ్చాత్తాపపడవలదు !

౬. అయితే, "మాయిష్టము వచ్చినట్లు త్రావుటకు మాకు హక్కుకలదు" అని జను లాక్షేపింపవచ్చును. వీరాత్మస్వాతంత్ర్యమును జాటువారుకాఁబోలు ! కొంతకాలముక్రిందట

ఇంగ్లాండులో నొక ప్రభువిట్లే పలికెను. ఈప్రశ్నకు ప్రతిచెప్పుట కొంచెముకష్టము. ఏలనన, తనపొట్ట పగులువఱకు త్రావగల్గిన వాని యిష్టమున కడ్డమువచ్చుటెట్లు. అయితే మన మితరవిషయములలోఁ జట్టముల నెట్లు శాసించినామొ కొంత వీక్షించెదము. సంఘాభివృద్ధికై, న్యాయాభివృద్ధికై మనము శాసనములను, కచ్చేరీల నేర్పాటు చేసినారలము. నాయిష్టవచ్చినటులనే నల్లరిచేయుదునను వానిని మనముపట్టి పోలీసు స్టేషనులో నుంచుదుము. నాయిష్టముచొప్పున నేను దొంగలించుదును. అనువానిని కారాగృహమందుంచుదుము. ఇక్కడ స్వేచ్ఛాస్వాతంత్ర మెచ్చటికేగెను ? మఱియు మునిసిపాలిటీవారు "మార్కెట్టు"లలో దినమును పరిశీలించి చెడినవస్తువుల నమ్మనీయరు. మాంసముచెడి దుర్వాసన నిచ్చుచుండిన నద్దానినమ్మఁనీయరు. ఏల? ఆరోగ్యార్థమై! అయితే మద్యపాన మారోగ్యమైనదా? వైద్యుల యభిప్రాయము వేరు. వారి ననుసరించిన నీయనారోగ్య వస్తువేలనమ్ముటకై లైసన్సుల నీయవలయునో తెలియకున్నది !

౭. హస్త పరిశ్రమలయందు ఆల్కహోలు మొదలగు ద్రవ్యముల నుపయోగించుచున్నారు. ఆల్కహోలును నిషేధించిన చేతిపనులకుఁ గష్టము వచ్చును గదా! ఆల్కహోలు త్రావఁగూడదుకాని చేతిపనులకై యుపయోగింపవచ్చును. పాశ్చాత్యదేశములలో ననేక హస్తపరిశ్రమములు ఆల్కహోలు

వలన చేయఁబడుచున్నవి. ముచ్చెలకు రంగు చేయుటకై దీని నుపయోగింతురు. టోపీలను బిగువుగాఁ జేయుటయందివి చాల యుపయోగము. పత్తి, పట్టువస్తువులకొఱకును దీనిని వాడుదురు. యంత్రములయందుఁగూడ దీని సహాయము వలయును. స్పిరిటు దీపములను దీనిచే వెలిగించుదురు. ఇట్టివే కాక యింకను గ్రొత్తపరిశ్రమలఁ గనిపెట్టి యుపయోగింపవచ్చును. సర్కారువారుగూడ యిట్టివానికిఁ బ్రోత్సాహ మొసఁగవలయును. ఇట్లు ఆల్కహాలువలన నష్టమునకు మారుగా లాభముండును.

కావున మనపక్షమందుండని వారెన్ని యుక్తులతో మద్యపానమును నిలుపవలయునని తలఁచిన నుపయోగము లేదు. ఈయభ్యాసము సర్వానర్థదాయకము. కావున మనము మన భూమియందు దీనిని నిర్మూలించు యోచనలఁ జేయవలయును.

అసహాయోద్యమము మన భూమియందు ప్రారంభమయినవెంటనే యొక నవీన ప్రబోధము కలిగెను. జనులే యుత్సాహయుక్తులై మద్యపాన నిరోధమును గుఱించి యాలోచింపఁ దొడగిరి. త్రావుచుండిన వారలలో ననేకులు లజ్జాహతచేతస్కులై దేశక్షేమమును గోరి తమయలవాటును మానుకొనిరి. ఇంకను మాననట్టివారికి బోధచేయఁదలఁచి దుకాణముల దగ్గఱనిలిచి వారిమనములఁ ద్రిప్పఁదలఁచిరి. ఇట్లుచేయుటయందుఁ గొంద ఱుత్సాహాధిక్యతచేఁగాఁబోలు హింసామార్గ

మవలంబించిరి. అహింసాప్రాముఖ్యత నొందిన యుద్యమమం దెప్పుడు హింసాసర్పము నల్లనల్లనఁ బ్రాకఁజొచ్చునో నప్పుడే క్షీణదశ ప్రాప్తించును. కావునఁ గొన్నిచోట్ల హింసించుట మొదలగు సర్కారువారేమి, లోకులేమి, యీమార్గమును ఖండించిరి. అయిన మొత్తముమీద యనేకస్థలములందు దుకాణములదగ్గఱ బోధసేయువారు శాంతులై, సత్వగుణప్రధానులై, తమ సోదరులకు సన్మార్గాదర్శనమును జూపుచువచ్చిరి. డాక్టరు జాన్సను ఇంగ్లాండులో నుపన్యసింప సమకట్టినప్పుడచ్చటివిద్యార్థు లతనికంటికి దెబ్బలదగిలించి యంధునిగాఁ జేసిరి. కాని మనదేశమున విద్యార్థులే యొకరొకరు జాన్సనులై జనులకు బోధించిరని నుప్పొంగుచున్నాను.

ఉత్తర హిందూస్థానములో 'డాక్టర్ కనూగా' యను సోదరుఁడు సారాయి దుకాణములదగ్గఱ యుపన్యాసములిచ్చునపుడొక త్రాఁగుబోతతనిపై రాయిరువ్వఁ గంటికిఁ దగిలెను. రక్తధారలు స్రవించినను, రౌద్రమువహింపక, కట్టుకదలక శాంతవచనములతో మరలవారికి బోధసేయుచుండెను. తుదకు జనులు జాలినొంది త్రావుటకొక్కరును రాకపోయిరఁట. అతఁడు దెబ్బతగిలినవెంటనే చిఱ్ఱునరేగికోపించి తన సహకారులతో వారిపై కలహమునకేగియుండినఁ దనయుద్యమము చెడిపోయియుండును. మఱియు నాత్మబలము బదులునకుబదులు చూపించుటలేదు. హింసనోర్చి యెదుటివానిని క్షమించుటే ధృతి.

ఈబోధ (పికెటింగ్) సర్వదా సహాయకారియని చెప్పుటకు వీలులేదు. హైందవులిప్పుడు శ్రద్ధతో దేశోద్ధరణమునకై ప్రయత్నించుచున్నను, సమస్త ప్రదేశములందు నిశ్శేషముగా నీబాధ నిలిచిపోవునని చెప్పఁజాలము. ఇంతవఱకు మనదేశములో దుకాణములదగ్గఱ బోధచేసినందుకుఁ గొన్నితావుల నల్లరులు ప్రబలినవి. మన వాలంటియర్లెంత శాంతమార్గమవలంబించిన నపేక్షించినంతలాభము గనఁబడలేదు. 'జోషీ' యను నతఁడు పికెటింగునకై కారాగృహమందుఁ గఠినశిక్ష ననుభవించుచున్నాఁడు. ఇటులే యనేకులు జైలు నలంకరించినారలు. ఇటీవల మద్రాసు శాసనసభయందు శ్రీ. సి. వి. వెంకట్రామ అయ్యంగారు అబ్కారీ మొదలగువాని శాఖయొక్క మంత్రినిట్లు ప్రశ్నించెను.

(౧) గతసంవత్సరము కల్లుదుకాణము లెంతకమ్మిరి. ఈసంవత్సరము ధరలెట్లున్నవి?

(౨) సేలం, కోయంబుత్తూరులో ప్రతితాలూకాలో గతసంవత్సరమును, ఈయేడు నేరీతి పాటపాడినది తెలుపవలయును.

(3) వ్యత్యాసములు కలిగిన గవర్నమెంటేమి యాలోచన చేసినారలు?

(౧) ఈప్రశ్నల కిట్లు ప్రత్యుత్తరమివ్వఁబడెను.

జిల్లా.	సం॥ ౧౯౨౦-౨౧.	సం॥ ౧౯౨౧-౨౨.
	రూపాయలు.	రూపాయలు.
గంజాము	౪౩౯౪౩	౩౨౦౨౧
విశాఖపట్టణము	౧౦౪౯౦౨	౩౫౨౫౦
గోదావరి	౧౮౬౮౧౦	౫౧౫౦౧
కృష్ణా	౪౦౬౮౩౯	౯౦౭౮౯
గుంటూరు	౧౫౪౪౬౭	౨౩౧౯౩
నెల్లూరు	౧౬౭౬౬౭	౨౨౮
కడప	౨౩౨౦౮౦	౧౧౦౦౦౧
కర్నూలు	౭౮౫౦౬౪	౩౯౫౫౪౦
మద్రాసుపట్నము	౭౩౬౩౨౦	౪౭౪౦౬౦

ఇట్లు తక్కిన జిల్లాలన్నియు కలసి

మొత్తము. ౧,౫౦,౪౨,౪౭౩. ౮౨,౯౦,౫౮౯

(౨) కోయంబుత్తూరులో వారు తెల్పినవానిలో నిచ్చట కొన్నివిషయముల వ్రాయుచున్నాను.

తాలూకా	౧౯౨౦-౨౧.	౧౦౨౧-౨౨.
కోయంబుత్తూరు	౨౩౯౮౬౮	సవాలు చేయలేదు.
ఈరోడ్డు	౧౭౬౪౧౨	,,
పల్లాడము	౧౫౦౫౪	౪౧౪౦

సేలం తాలుకాలు.

అత్తూరు	౧౦౬౦౨౦	సవాలులేదు.
హోసూరు	౧౧౭౭౦౮	,,

కృష్ణగిరి	౭౮౬౫౩	సవాలు లేదు.
రాసిపురము	౧౦౪౪౩౪	,,
నమక్కాల్	౧౪౦౫౭౬	,,

(3) మూఁడవప్రశ్నకిట్లు జవాబిచ్చిరి. "ప్రభుత్వమిం కను నీవిషయమై యేవిధమైన నిశ్చయముచేయ లేదు.

ఈవిషయముల గమనించినచో ప్రతి జిల్లాయందును నసహాయోద్యమ ప్రభావము వెల్లడియగుచున్నది. ముఖ్య ముగ సేలము, కోయంబుత్తూరు, నెల్లూరు, గుంటూరు, అనంత పురము, కనరా, మొదలగు జిల్లాలలోఁ జాలమట్టునకు జయము కలిగినది.

మనదేశమందు మద్యపానమును నిర్మూలించుట కితర విధములుగూడ కలవు. నూతన సంస్కారములు (Reforms) నమ్మువారును ప్రయత్నింపవచ్చును. శాసనసభలకై సభ్యు లనువారు తమవోట్లను మద్యపాన నిషేధమును చేయించుదు మని వాగ్దానము చేయువారికే యిచ్చెదమని తీర్మానించుకొనిన ముందు శాసనసభలందుఁ బోవువారీవిషయమును శ్రద్ధతో నాలోచించుదురని తలఁచెద.

దీనికి మఱియొక విధముగూడకలదు. మితజీవన(Tempe-rance)సంఘమువారు మద్యపానమువలని కీడుల జూపించుపట్టీ లను, చిత్తరువులను, పదములను, నచ్చువేయించి లోకులకుఁ బంచిపెట్టి బోధించుచుండవలయును. మద్యనిరోధమువలన,

నైతికాత్మీయలాభములు కలుగునని త్రాగువారికిఁ జెప్పిన లాభ ముండదు. వారికి దీనివలన నష్టములు, బాధలు మొదలగునవెట్లు కలుగునో నిరూపింపవలయును. స్త్రీలకుఁ దమభర్తల పోరాట మెంత కష్టతరమో తెలుపవలయును. ఇట్లుచేసిన సత్ఫల మబ్బును.

అయితే ఈతచెట్లను, టెంకాయచెట్లను బెంచి దానిపై జీవించువారి యవస్థయేమి? అని ప్రశ్నింపవచ్చును. ఈవృక్ష ములవలన నింకేమైన యుపయోగములు కలవాయని పరిశీ లింపవలయును. శాస్త్రజ్ఞులు (Scientists) దీని నాలోచించి వానివలన సద్వినియోగములను జూపింపవలయును. ప్రచు రణ శాఖవారు కొన్ని దినములక్రిందట యొకపత్రమును ప్రక టించి యందు టెంకాయచెట్లనుండి చక్కెర, బెల్లముమొదలగు వానిని సిద్ధముచేయనచ్చునని తెల్పిరి. వీరివలనఁ బూర్వమా ర్కారీమామూలాలు లేనికాలమున ('కనరా') దక్షిణ హిందూ స్థానమున టెంకాయచెట్లనుండి బెల్లము తీయుచుండిరనియు, గల్లుతీయుట కేర్పాటుచేసినపిమ్మట యీవృత్తి నాశనమయ్యె ననియుఁ దెలియుచున్నది. మరల నాలుగైదు సంవత్సరముల నుండి కనరాలోఁ గొన్నిచోట్ల పూర్వపరిశ్రమలు చేయఁబడు చున్నట్లు తెలియవచ్చుచున్నది. ౧౦, ౧౫ వృక్షముల నొక్కడే గీచి చక్కెర చేయగలఁడనియు, నొక్కొక్క చెట్టునుండి రెండు గ్యాలన్లరసము వెడలుచు, ౫౧ పౌనుల తూకగలబెల్లము తీయఁ

బడుడనియుఁ దెలియుచున్నవి. ఒక్క చెట్టునుండి తీసిన బెల్లము సాధారణముగా ౬ రూపాయీల ధరనిచ్చును, కావున నీవిషయముల గమనించి కల్లునుతగ్గించి చేతిపనులు వృద్ధిపఱచి లోకులకు మేలొనరింపవలయుననిన వృక్షములుగలవారి పరిశ్రమములఁ జేయువారికే యిచ్చిన లాభముండును.

ఈగ్రంథమును ముగించుటకుఁ బూర్వము ప్రఖ్యాతిగాంచిన పుస్సీఫుట్టు జాన్సన్‌గారు హిందూస్థానవిషయమేరీతి నాలోచించినది తెలిపెదను. "మీ జనులకు మద్యాదుల మానుఁడని నేనుజెప్పుట యధికప్రసంగమని తలఁచెదను. స్వభావముచేతను, మతానుసారముగను, హిందువులు మద్యపానము చేయనివారు. అమెరికాదేశమును గనుఁగొనుటకు వేలసంవత్సరములకుమున్నే హిందూస్థానము నిషేధమును నేర్పియుండుటజూడ మాదేశము సహితము మీవలన నీయభిప్రాయమును గ్రహించినదని తలఁచుచున్నాను. ఏది యెట్లున్నను మేమాలోచించి యాచరించునది మీ యభిప్రాయములతో నేకీభవించుచున్నది."

వీరు హిందూస్థానమునకు వచ్చుటకుఁ బూర్వము మన నాయకులలో నొకరగు సెంటునిహాలుసింగుగారు వీరితోఁగలిసి 'మాదేశీయులకు మీసందేశమెట్టిది' యని ప్రశ్నింపగా నిట్లు చెప్పఁదొడఁగిరి. "హిందూస్థానము మతభక్తిగలభూమి; తత్త్వదర్శముల ప్రతిపాదించిన పుణ్యస్థలము. మద్యపాన నిషేధ

మును బూర్వమే యొనరించిన దేశము. పాశ్చాత్యులఁజూచి మీరు త్రాగుటనభ్యసించి; మీ మతసూత్రముల మంటఁగలిపి, మీయాధ్యాత్మికాధిభౌతికాదర్శముల నాశన మొనరించినందులకు నాకు వ్యసనమగుచున్నది. మీరు మాపద్ధతుల ననుసరింపవలయునన్న మాదురభ్యాసములనే యేల నేర్చుకొనవలయును? మాసత్ఫలముల నరుగఁజనదా? బ్రిటీషు చిత్రశాల (British Museum) లో బాబిలోని యొంరాజు ౪౨౦౦ సంవత్సరములకుమున్ను మద్యపాన నిషేధన శాసనములు నేర్పాటు చేసినట్లు తెలియవచ్చును. నాటినుండి నేఁటివఱకును, ప్రజ్ఞావంతులు, శాసనకారులు, మున్నగువారు ప్రపంచమందంతను మద్యవ్యాపారములఁ దగ్గింపవలయుననియే ప్రయత్నించుచున్నారు. తుదకీనాఁడులోక మీవ్యాపారమందపూర్వముగాఁ జిక్కిపోయినది. ఈనాఁటి లోకులవలన నీవ్యాపారము క్షీణదశ నొందింపఁబడుచున్నది. కావున హిందూస్థానమందలి వారు సహిత మీవిషయమై ప్రయత్నము చేయవలయును."

భారతీయులారా! లెండు! ప్రబోధముగాంచుడు!

"అసతోమాసద్గమయ
తమసోమాజ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ"
ఓం. శాంతిశ్శాంతిశ్శాంతిః!!

1764



1764

నీవు “విక్టోరియా” గడియారములే కొనుము.

ఏలననగా, కాలమును సరిగాచూపును. భద్రముగా అనేకసంవత్సరములుండును. ఏలాటి అసంతృప్తిని కలుగజేయవు. ప్రసిద్ధినొందిన లీవరుతో చేయబడి, 15 జ్యూయల్సును కలిగియున్నవి. రఫ్‌గా ఉపయోగించుటకే ప్రత్యేకముగా తయారుచేయబడినవి.

నికలుతో చేయబడినది	రూ.	28	0	0
సిల్వరు..............	,,	35	0	0
రేడియముడయలుకలది. అధికము		5	0	0

రెండుసంవత్సరములకు గ్యారంటీ యిత్తుము.

తంతివిలాసము:—“జీలానీ” స్థాపితము. 1888.

కాదరు అండు యూసపు బ్రదర్సు,

గడియారముల వ్యాపారస్థులు.

గవర్నమెంటు రైల్వేవారలకు సప్లైదారులు, మదరాసు.

PRINTED AT THE INDIA PRINTIMG WORKS, MADRAS.

ఆంధ్రవిద్యార్థి సువర్ణపతకములు.

ఆంధ్రవిద్యార్థి మాసపత్రికయందు ప్రచురింపబడు
సములలో సంవత్సరమునకు నారింటికి తక్కువగాక పం
రిలో నిరువురకు విలువగల రెండు సువర్ణ పతకములు
మతిగా నొసగబడును. రెండువ్యాసములుమాత్రమే ప
పంపువారికి రజితపతక మొకటి పంపబడును.

నియమములు.

౧. విలేఖకుడు పత్రికకు సంవత్సరమునకు రెండురూపా
చెల్లించి చందాదారుడుగ నుండవలయును.

౨. ఈ బహుమతినందుటకు విద్యార్థులేగాక తదితరులు
మర్హులే.

3. వ్యాసము ఏ విషయముపైనైనను వ్రాయవచ్చును
మూడుపుటలు ఫూల్‌స్కాపుసైజు మించకూడదు.

౪. అర్హులగువారలకు సంపాదకీయవర్గము వారి తీర్మానవ
వెంటనే బహుమతు లొసగబడును.

సంపాదకుడు :—

భిషగ్వర, మైపు. సుబ్రహ్మణ్యశర్మ, ఏ. యం. ఏ. సి.

ఆంధ్రవిద్యార్థి ప్రచురణాలయము,

అనంతపురము.

1764

1764

1764

END OF
TITLE